



# విశాల భారతి

1-9-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్

సంపుటి:4 సంచిక: 9




# విశాల భారతి

1-9-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 9


## కేసీఆర్‌జగన్ దావత్ దోస్తులు



- నదీ జలాల వివాదం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది
- ఈ అంశంపై బండి సంజయ్ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పొలిటికల్ డ్రామాలు ఆడుతున్నాయన్నారు
- సీఎం ఇరిగేషన్ ప్రాజెక్టులపై అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు
- కేసీఆర్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు
- రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ అడ్డుకోలేదని దుయ్యబట్టారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నెల కొన్న కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదం ప్రస్తుతం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. ఈ సున్నితమైన అంశంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టుల విషయంలో అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ పార్టీలు కేవలం ప్రజల దృష్టిని మళ్లించడానికే పొలిటికల్ డ్రామాలు ఆడుతున్నాయని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి ఇరిగేషన్ ప్రాజెక్టులపై పచ్చి అబద్ధాలు

మిగతా 2లో..



తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం మంత్రుల వ్యక్తిగత వ్యవహారాలు, సోషల్ మీడియా ,కొన్ని ప్రధాన వార్తా సంస్థల్లో వస్తున్న కథనాలు పెను సంచలనం సృష్టిస్తున్నాయి. పాలనపై దృష్టి సారించాల్సిన మంత్రులు, మహిళా అధికారులతో, జర్నలిస్టులతో ప్రవర్తిస్తున్న తీరుపై ప్రతిపక్షాలే కాకుండా, సామాన్య ప్రజానీకంలోనూ చర్చ మొదలైంది. ముఖ్యంగా నల్గొండ, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఇద్దరు మంత్రులపై వస్తున్న ఆరోపణలు కాంగ్రెస్ ప్రభుత్వానికి కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతున్నాయి. నల్గొండ జిల్లాకు చెందిన ఓ సీనియర్ మంత్రి, ఒక మహిళా ఐఏఎస్ అధికారితో సాగిస్తున్న 'లేట్ ఏజ్' ప్రేమాయణంపై ఎన్టీవీ ప్రసారం చేసిన కథనం రాజకీయ వర్గాల్లో బాంబు పేల్చింది. సదరు మంత్రి తన పరపతిని ఉపయోగించుకుని, తనకు నచ్చిన చోట ఆ అధికారిణికి పోస్టింగ్ ఇప్పించుకున్నారని, పరిధి దాటి ఆమెతో సన్నిహితంగా ఉంటున్నారని వార్తలు వస్తున్నాయి. ఇది కాస్తా మంత్రి కుటుంబ సభ్యులకు తెలియడంతో ఇంట్లో గొడవలు మొదలైనట్లు సమాచారం.

# కాంగ్రెస్ క్యాబినెట్‌లో లవ్ వైరస్

రాష్ట్ర రాజకీయాల్లో మంత్రుల వ్యక్తిగత వ్యవహారాలు సంచలనంగా మారాయి

- కొన్ని ప్రసార మాధ్యమాల్లో వస్తున్న కథనాలు పెను సంచలనం సృష్టిస్తున్నాయి
- మంత్రులు, మహిళా అధికారులతో ప్రవర్తిస్తున్న తీరుపై చర్చ మొదలైంది
- ముఖ్యంగా నల్గొండ, కరీంనగర్‌కు చెందిన ఇద్దరు మంత్రులపై ఆరోపణలు
- ఈ మేరకు ఎన్టీవీ ప్రసారం చేసిన కథనం రాజకీయ వర్గాల్లో బాంబు పేల్చింది
- పరిధి దాటి ఆమెతో సన్నిహితంగా ఉంటున్నారని వార్తలు వస్తున్నాయి
- మంత్రి కుటుంబం నేరుగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి మొరపెట్టుకున్నట్లు సమాచారం
- సీఎం పేరుతో మాధవి అనే మహిళ చుట్టూ కూడా అనేక కథనాలు వినిపిస్తున్నాయి

03






## యూరియా కార్డుల పేరుతో నాటకాలు

- ప్రభుత్వంపై కేటీఆర్ విరుచుకుపడ్డారు
- రైతుల ఇబ్బందులను ప్రస్తావించారు
- ప్రభుత్వ తీరును ఎండగట్టారు
- యూరియా కోసం అల్లాడుతున్నారన్నారు
- కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు
- బీఆర్ఎస్ హయాంలో ఇలాంటి కష్టాలు రాలేదు

03



## భారత్‌పై ట్రంప్ బాంబ్

- ట్రంప్ అత్యంత కఠినమైన నిర్ణయాల దిశగా అడుగులు
- భారత్, చైనాపై 500 శాతం వరకు అదనపు సుంకాలు
- రష్యాపై ఆర్థికంగా తీవ్ర ఒత్తిడి తీసుకురావడానికి సిద్ధం
- ద్వైపాక్షిక ఆంక్షల బిల్లుకు గ్రీన్ సిగ్నల్
- రష్యా చమురు దిగుమతి చేసుకొనే దేశాలకు హెచ్చరిక
- బిల్లుపై వచ్చే వారమే ఓటింగ్ జరిగే అవకాశం

**విశాలభారతి, నేషనల్:**

ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకడమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత కఠినమైన నిర్ణయాల దిశగా అడుగులు వేస్తున్నారు. రష్యాపై ఆర్థికంగా తీవ్ర ఒత్తిడి తీసుకురావడానికి సిద్ధమైన ఆయన, తాజాగా ఒక కీలక ద్వైపాక్షిక ఆంక్షల బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ పరిణామం అంతర్జాతీయ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలకు ఇది ఒక హెచ్చరికగా మారింది. ఈ కొత్త ప్రతిపాదన ప్రకారం రష్యాపై విధించిన అంతర్జాతీయ ఆంక్షలను ధిక్కరించి ఆ దేశంతో వ్యాపార సంబంధాలు కొనసాగించే వారిపై అమెరికా కఠిన చర్యలు తీసుకోనుంది. ఒకవేళ ఈ బిల్లు చట్టంగా మారితే,

మిగతా 2లో..

## మేడారం జాతరకు కేసీఆర్‌కు ఆహ్వానం

- తెలంగాణ కుంభమేళాగా మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర
- రాజకీయాలకు అతీతంగా ఒక అరుదైన సన్నివేశం ఆవిష్కృతమైంది
- మంత్రులు కొండా సురేఖ, సీతక్క బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆహ్వానించారు
- కేసీఆర్ ఎంతో ఆత్మీయంగా బాగున్నారా అమ్మ అంటూ పలకరించారు
- మంత్రులకు పసుపు, కుంకుమ, చీరలు అందించి తాంబూలాలతో సత్కరించారు
- మంత్రులకు అతిథి మర్యాదలు చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ కుంభమేళాగా పిలుచుకునే మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతర వేళ రాజకీయాలకు అతీతంగా ఒక అరుదైన, ఆహ్లాదకరమైన సన్నివేశం ఆవిష్కృతమైంది. రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క కలిసి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆయన నివాసంలో కలవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు

మిగతా 2లో..

## జనంలోకి ముఖ్యమంత్రి

- తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి
- మోదీ ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి యుద్ధం ప్రకటించారు
- ఉపాధి హామీ పథకం మార్పులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు
- పథకాన్ని శాశ్వతంగా సమాధి చేసే కుట్ర జరుగుతోందన్నారు
- పేదల హక్కులను కాలరాస్తే ఊరుకోబోమని హెచ్చరించారు
- కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలపై కన్నేసింది
- రాబోయే ఎన్నికల్లోనూ క్లీన్ స్వీప్ చేయాలని వ్యూహ రచన చేస్తోంది
- ఫిబ్రవరి 3 నుంచి 9వ తేదీ వరకు బహిరంగ సభలు నిర్వహించనుంది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అటు కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై, ఇటు రాష్ట్రంలోని ప్రతిపక్షాలపై సీఎం రేవంత్‌రెడ్డి యుద్ధం ప్రకటించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కేంద్రం తీసుకువస్తున్న మార్పులపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల పొట్ట కొట్టడానికే నిబంధనల మార్పు ముసుగులో ఈ పథకాన్ని శాశ్వతంగా సమాధి చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆయన మండిపడ్డారు. గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, అధికార గర్వంతో పేదల హక్కులను కాలరాయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలు ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారాయని రేవంత్ విశ్లేషించారు. గత ఎన్నికల్లో 400 సీట్లు వచ్చి ఉంటే బీజేపీ రాజ్యాంగాన్నే మార్చేసేదని, తద్వారా కార్పొరేట్ శక్తులకు దేశాన్ని అప్పగించే ప్రయత్నం చేసేవారని ఆరోపించారు.



మిగతా 2లో..

## ఏళ్ల నాటి పోరాటానికి ముగింపు



- ప్రణయ్ హత్య కేసు చరిత్రలోనే ఒక చెరగని గాయం
- ప్రేమించి పెళ్లి చేసుకోవడంతో ప్రాణాన్ని తీశారు
- అమృత తన కళ్లెదుటే భర్తను కోల్పోయింది
- కోర్టు వెలువరించిన తీర్పు బాధితులకు ఊరటనిచ్చింది
- నిందితుడు శ్రవణ్ కుమార్‌తో పాటు ఇతరలకు జీవిత ఖైదు విధించింది
- అయితే ఇప్పుడు నిందితుడుకి బెయిల్ మంజూరు అయింది
- ఇలాంటి పరిణామాలను జీర్ణించుకోవడం కష్టమే

03

## రూ. 2000 కోట్ల భూ 'భాగోతం'!

- హైదరాబాద్‌లో భూముల ధరలకు రెక్కలు
- అక్రమార్కుల కళ్లు ప్రభుత్వ భూములపై పడ్డాయి
- రంగారెడ్డిలో భారీ భూ కుంభకోణం వెలుగుచూసింది
- శేరిలింగంపల్లి, మక్తా మహబూబ్‌పేటలో ఘటన
- 43 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసేందుకు స్కెచ్
- విలువ సుమారు రెండు వేల కోట్ల రూపాయలు
- జిల్లా జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కీలక పాత్ర

03



# కేసీఆర్-జగన్ దావత్ దోస్తులు



( మొదటిపేజీ తరువాయి )

మాట్లాడుతున్నారని, వాస్తవాలను దాచిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. నదీ జలాల కోసం తాము క్షేత్రస్థాయిలో పోరాడుతున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ కనీసం ఉనికిలో కూడా లేదని బండి సంజయ్ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉందన్న విషయాన్ని ఆయన స్పష్టం చేశారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును తామే ప్రారంభించామని కాంగ్రెస్ నాయకులు చెప్పుకోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకవేళ అది నిజమైతే, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఈ ప్రాజెక్టు పేరు ఎందుకు చేర్చలేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. చట్టంలో లేని ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎలా ఇస్తారని ఆయన నిలదీశారు. తెలంగాణకు సాగునీటి రంగంలో మరణశాసనం రాసింది గత పాలకులేనని సంజయ్ విమర్శించారు. పునర్విభజన చట్టంలో కేవలం ఆరు ప్రాజెక్టుల ప్రస్తావన మాత్రమే ఉందని, అందులో లేని పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని లొల్లి చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కృష్ణా జలాల కేటాయింపుల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, దీనికి ప్రధాన కారకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆయన ఆరోపించారు. కేసీఆర్ తన పంతం కోసం, స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ద్వారా తెలంగాణ నీటిని అక్రమంగా తరలిస్తున్నా, అటు కాంగ్రెస్ ఇటు బీఆర్ఎస్ పార్టీలు నోరు మెదపలేదని బండి సంజయ్ గుర్తు చేశారు. గతంలో కేసీఆర్ పెద్ద పెద్ద మాటలు చెప్పారని, "కృష్ణా నది మీ జాగీరా? అణుబాంబు అవుతా" అంటూ డైలాగులు కొట్టారని ఎద్దేవా చేశారు. కానీ తీరా చూస్తే ఆ అణుబాంబు కాస్తా తోక పటాకు కూడా కాలేదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఉమాభారతి సమక్షంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేవలం 299 టీఎంసీల వాటాకే కేసీఆర్ అంగీకరించి రాష్ట్రానికి అన్యాయం చేశారని మండిపడ్డారు. తెలంగాణకు కృష్ణా జలాల్లో జరిగిన అన్యాయాన్ని తానే స్వయంగా బయటపెట్టానని, అప్పట్లో తన మాటలను తప్పుపట్టేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించారని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ నాయకులతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని, ఇక్కడ తెలంగాణ ప్రజల ముందు మాత్రం ఉల్టా డైలాగులు కొట్టారని విమర్శించారు. లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టి దానిని 'కూలేశ్వరం'గా మార్చేశారని, ఆ తర్వాత కృష్ణా నదిపై కన్నేసి పాలమూరురంగారెడ్డి పేరుతో మరో భారీ కుంభకోణానికి తెరలేపారని తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు అంచనాలను భారీగా పెంచి ప్రభుత్వ ధనాన్ని వృథా చేశారని సంజయ్ పేర్కొన్నారు. 80 వేల కోట్ల అంచనాతో మొదలుపెట్టి ఇప్పటివరకు వేల కోట్లు ఖర్చు చేసినా, చుక్క నీరు కూడా పొలాలకు అందలేదని ఆయన వాపోయారు. అసలు ఎలాంటి అంచనాలు లేకుండా దాదాపు లక్షన్నర కోట్ల రూపాయల వరకు ఖర్చు చేసి ఉంటారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. 2016, 2020 సంవత్సరాల్లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశాల్లో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన స్పష్టం చేశారు. ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రగతి భవన్ కు వచ్చినప్పుడు వారిద్దరి మధ్య జరిగిన చర్చలు కేవలం ఫార్మాలిటీ కాదని, అందులో ఏదో మర్మం ఉందనే విషయాన్ని తాను అప్పుడే చెప్పానని సంజయ్ గుర్తు చేశారు. నదీ పరివాహక ప్రాంతాల విషయంలో భేషజాలు వద్దంటూనే, రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు జరుగుతున్నా కేసీఆర్ అడ్డుకోలేదని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రయోజనాలను పక్కనపెట్టి, ఏపీ నేతల ఇళ్లలో విందులు ఆరగించడానికే ప్రాధాన్యత ఇచ్చారని ఆయన ఘాటైన విమర్శలు చేశారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ నీటి దోపిడీపై కవిత కూడా నోరు విప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. జగన్ నివాసంలో జరిగిన విందులో ఆమె కూడా పాల్గొన్నారని, అక్కడ జరిగిన అంతర్గత చర్చల వివరాలను బయటపెట్టాలని కోరారు. ఆనాడు రాయలసీమను రత్నాల సీమగా మారుస్తానని కేసీఆర్ పెద్దన్న పాత్ర పోషించారని, కానీ మన రైతుల పొట్ట కొట్టారని మండిపడ్డారు. విందులో పాల్గొని తిరుగు ప్రయాణంలో తిరుమల యాత్రను కూడా రద్దు చేసుకున్నారంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని ఆయన అన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం వల్ల తెలంగాణకు జరిగే అన్యాయాన్ని నిరసిస్తూ తాము ఇళ్లపై నల్ల జెండాలు ఎగురవేసి పోరాటం చేశామని సంజయ్ గుర్తు చేశారు. కానీ అధికారంలో ఉన్నవారు మాత్రం ఏపీ ప్రభుత్వంతో అంటకాగి రాష్ట్రానికి ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు మళ్లీ అదే పార్టీలు ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రాజెక్టుల అంశాన్ని వాడుకుంటున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని ఆయన విమర్శించారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, త్వరలోనే వీరికి గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. మొత్తానికి ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులను, ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును బండి సంజయ్ ఎండగట్టారు. తెలంగాణకు దక్కాల్సిన ప్రతి నీటి బొట్టు కోసం బీజేపీ పోరాడుతుందని, కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ రాష్ట్ర ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం నదీ జలాలను వాడుకోవడం మానుకోవాలని, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని ఆయన రెండు పార్టీలకు హితవు పలికారు.



## తప్పిదాలకు తావు లేకుండా ఓటరు జాబితా

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నిజామాబాద్, విశాలభారతి:**

ఎలాంటి తప్పిదాలు, పొరపాట్లకు తావు లేకుండా తుది ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయాన్ని కలెక్టర్ గురువారం సందర్శించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, కమిషనర్ శ్రావణి, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ ఎలక్షన్ షెడ్యూల్ వెలువడిన వెంటనే ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఒక్కో వార్డు వారీగా ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని అన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ముసాయిదా జాబితాను ప్రదర్శించాలని, అభ్యంతరాలను స్వీకరించి సకాలంలో వాటిని పరిష్కరించాలని, జనవరి 12వ తేదీన తుది ఓటరు జాబితా వెలువరించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఒక్క ఓటు కూడా ఎంతో కీలకం అయినందున, అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు జాబితా నుండి తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అదే సమయంలో బోగస్ ఓటర్లకు తావు లేకుండా క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన జరపాలని ఆదేశించారు. ఉద్దేశ్యపూర్వకంగా, నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ అనవసర తప్పిదాలకు తావు కల్పిస్తే, సంబంధిత బూత్ లెవెల్ అధికారులను, సూపర్వైజర్లను, ఇతర అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని అన్నారు. తుది జాబితా వెలువరించడానికి ముందే సవరించిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ ను ర్యాండమ్ గా చెక్ చేయాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అవసరమైతే రెవెన్యూ అధికారుల సహకారం తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు.డసమావేశంలో తహసిల్దార్ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

# జనంలోకి ముఖ్యమంత్రి

( మొదటిపేజీ తరువాయి )

కాంగ్రెస్ పార్టీ ప్రజలను అప్రమత్తం చేయడం వల్లే వారి దూకుడుకు బ్రేకులు పడ్డాయని అభిప్రాయపడ్డారు. ఓట్లను తొలగించేందుకు ఎస్ఐఆర్ వంటి అంశాలను తీసుకురావడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, వీటిని తిప్పికొట్టాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజకీయాల విషయానికొస్తే, వరుస ఎన్నికల విజయాలతో జోరు మీదున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలపై కన్నేసింది. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటిన ఉత్సాహంతో, రాబోయే ఎన్నికల్లోనూ క్లీన్ స్వీప్ చేయాలని వ్యూహరచన చేస్తోంది. ప్రతిపక్షాల విమర్శలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టేందుకు రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని ముహూర్తం ఖరారు చేసింది. ఫిబ్రవరి 3 నుంచి 9వ తేదీ వరకు ఈ సభలు హోరెత్తనున్నాయి. ఈ బహిరంగ సభల సమన్వయ బాధ్యతలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించగా, పర్యవేక్షణ బాధ్యతలను మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చూసుకోనున్నారు. వరంగల్ జిల్లా ములుగులో జరిగే భారీ సభకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను ఆహ్వానించాలని పార్టీ భావిస్తోంది. పార్టీ నాయకత్వం ఈ సభలను ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందంటే, కనీసం ఒక మండలం బాధ్యతను స్వయంగా తానే తీసుకుంటానని ముఖ్యమంత్రి ప్రకటించడం విశేషం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదంటూ బీఆర్ఎస్, బీజేపీ చేస్తున్న ఆరోపణలను ఈ సభల ద్వారా తిప్పికొట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏపీ ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం మౌనంగా ఉందన్న విమర్శలకు కూడా ఇక్కడే సమాధానం చెప్పనున్నారు.



ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత అమలు చేసిన ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్ మరియు మహాలక్ష్మీ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించడం ద్వారా విపక్షాల నోళ్లు మూయించాలని కాంగ్రెస్ యోచిస్తోంది. స్థానిక సమస్యల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పూర్తిపై ప్రజలకు స్పష్టమైన భరోసా కల్పించాలని రేవంత్ రెడ్డి నిర్ణయించారు. తాము చేస్తున్న అభివృద్ధిని నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ప్రతిపక్షాలకు రాజకీయంగా చెక్ పెట్టవచ్చని ఆయన భావిస్తున్నారు. ఈ సభల వేదికగా కాంగ్రెస్ పార్టీ తన భవిష్యత్ కార్యాచరణను, ప్రజల పట్ల తనకున్న చిత్తశుద్ధిని చాటి చెప్పే ప్రయత్నం చేయనుంది. మరోవైపు మాజీ సీఎం కేసీఆర్ కూడా రంగంలోకి దిగుతానని ప్రకటించడం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తిని రేపుతోంది. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు తాము కూడా బహిరంగ సభలు నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. అయితే బీఆర్ఎస్ కంటే ముందే జనం ముందుకు వెళ్లి మైలేజ్ సాధించాలని కాంగ్రెస్ పార్టీ అత్యంత వేగంగా అడుగులు వేస్తోంది. దీనివల్ల రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ప్రభుత్వ పథకాల అమలు తీరును, కేంద్రం చేస్తున్న రాజ్యాంగ వ్యతిరేక పనులను ఒకేసారి ప్రజలకు వివరించడం ఈ సభల ప్రధాన ఉద్దేశం. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలని కేంద్రం చూస్తోందని, దీనిని అడ్డుకోవడంలో కాంగ్రెస్ ముందుంటుందని రేవంత్ స్పష్టం చేస్తున్నారు. తెలంగాణ మోడల్ పాలనను ప్రజల గుండెల్లోకి తీసుకెళ్లేలా ఈ బహిరంగ సభల ప్రసంగాలు ఉండబోతున్నాయి.

సభల నిర్వహణలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూసేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలకు ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. అధికార యంత్రాంగం కూడా ఈ సభలకు హాజరయ్యే లబ్ధిదారుల వివరాలను, పథకాల గణాంకాలను సిద్ధం చేస్తోంది. ప్రతిపక్షాల విమర్శల్లో వాస్తవం లేదని, తాము పేదల పక్షపాతి అని నిరూపించుకోవడానికి కాంగ్రెస్ ఈ అవకాశాన్ని పూర్తిగా వాడుకోనుంది. మొత్తానికి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు కేంద్ర విధానాలపై పోరాడుతూనే, మరోవైపు రాష్ట్రంలోని ప్రతిపక్షాల దూకుడును అడ్డుకునేందుకు సిద్ధమైంది. ఫిబ్రవరి మొదటి వారంలో జరగబోయే ఈ బహిరంగ సభలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త మలుపులు తిప్పే అవకాశం ఉంది. ఈ పోరాటంలో ప్రజలు ఎవరి వైపు నిలుస్తారనేది రాబోయే మున్సిపల్ ఎన్నికల ఫలితాలే తేల్చనున్నాయి.

# మేడారం జాతరకు కేసీఆర్‌కు ఆహ్వానం

( మొదటిపేజీ తరువాయి )

వెళ్లిన మంత్రులు, జాతర ఆహ్వాన పత్రికను అందజేసి ఆయనను సగౌరవంగా ఆహ్వానించారు. ఈ భేటీలో రాజకీయ విభేదాల కంటే కూడా సంప్రదాయం, ఆత్మీయతలే ఎక్కువగా కనిపించడం విశేషం. మంత్రులు వచ్చిన తక్షణమే కేసీఆర్ ఎంతో ఆత్మీయంగా స్పందిస్తూ 'బాగున్నారా అమ్మ' అంటూ వారిని పలకరించడం అక్కడి వాతావరణాన్ని మార్చేసింది. ఒక ప్రతిపక్ష నేతగా కాకుండా, ఇంటికి వచ్చిన ఆడబిడ్డలను గౌరవించే ఇంటి పెద్దగా ఆయన వ్యవహరించారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తూ మంత్రులకు పసుపు, కుంకుమ, చీరలు అందించి తాంబూలాలతో ఘనంగా సత్కరించారు. కేసీఆర్ దంపతులు స్వయంగా మంత్రులకు అతిథి మర్యాదలు చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. దాదాపు ఇరవై నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో జాతర ఏర్పాట్లపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మేడారంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, భక్తుల కోసం కల్పిస్తున్న సౌకర్యాలను మంత్రులు కేసీఆర్‌కు వివరించారు. దీనిపై కేసీఆర్ కూడా సానుకూలంగా స్పందిస్తూ, జాతర విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ వేడుకను విజయవంతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. మంత్రుల ఆహ్వానం మేరకు తాను జాతరకు తప్పకుండా వస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఏదో ఒక రోజు వీలు చూసుకుని సతీసమేతంగా మేడారం వస్తానని ఆయన మంత్రులతో చెప్పారు. రవాణా సౌకర్యాల దృష్ట్యా హెలికాప్టర్‌లో వచ్చే ఆలోచన ఉన్నట్లు కేసీఆర్ వారితో పంచుకున్నారు. అమ్మవార్ల దర్శనం కోసం తాము వేచి చూస్తున్నామని, ఆ తల్లి దీవెనలు రాష్ట్రంపై ఉండాలని ఆయన కోరుకున్నారు.

ఈ భేటీ అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడుతూ తమ సంతోషాన్ని పంచుకున్నారు. రాజకీయాలను పక్కన పెట్టి, కేవలం ఒక ఆహ్వానం పంపే క్రమంలో తాము కేసీఆర్‌ను కలిశామని వారు స్పష్టం చేశారు. కేసీఆర్ తమను ఎంతో గౌరవంగా ఆహ్వానించారని, ఒక తండ్రిలాగా లేదా సోదరుడిలాగా ఆత్మీయంగా పలకరించడం చాలా బాగుందని కొండా సురేఖ, సీతక్క పేర్కొన్నారు. తమకు చీర పెట్టి ఆశీర్వదించడం తమ పట్ల ఆయనకున్న గౌరవానికి నిదర్శనమని వారు తెలిపారు. ముఖ్యంగా సీతక్క మాట్లాడుతూ, మేడారం జాతర అనేది తెలంగాణ ప్రజలందరి పండుగ అని, ఇక్కడ పార్టీలకు తావు లేదని చెప్పారు. ప్రభుత్వం తరపున అందరినీ ఆహ్వానించడం తమ బాధ్యత అని, అందుకే కేసీఆర్ దగ్గరకు వచ్చామని వివరించారు. పంతాలు, పట్టింపులు లేకుండా ప్రజాప్రతినిధులందరూ కలిసి జాతరను జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేసిందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశం ద్వారా రాష్ట్రంలో ఒక ఆరోగ్యకరమైన రాజకీయ వాతావరణం కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. సాధారణంగా అధికార, ప్రతిపక్షాల మధ్య నిరంతరం విమర్శలు నడుస్తుంటాయి. కానీ, సంస్కృతి, సంప్రదాయాల విషయంలో అందరూ ఏకం కావడం తెలంగాణ గొప్పతనాన్ని చాటిచెబుతోంది. ఇంటికి వచ్చిన ఆడబిడ్డలను గౌరవించడం ద్వారా కేసీఆర్ తనదైన శైలిలో అందరి ప్రశంసలు అందుకున్నారు. మేడారం జాతరకు దేశవ్యాప్తంగా భక్తులు తరలివస్తారని, అందుకే ఈసారి ఏర్పాట్లు మరింత భారీగా ఉన్నాయని మంత్రులు వివరించారు. కోట్లాది మంది భక్తుల నమ్మకానికి ప్రతీకగా నిలిచే ఈ జాతరను ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. కేసీఆర్ వంటి సీనియర్ నాయకులు కూడా దీనికి హాజరవడం వల్ల జాతర శోభ మరింత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.



మంత్రుల పర్యటన ముగిసిన తర్వాత ఎర్రవల్లి ఫామ్‌హౌస్ నుంచి వారు మేడారం పనుల పర్యవేక్షణకు బయలుదేరారు. ఈ చిన్న సమావేశం సోషల్ మీడియాలో కూడా వైరల్‌గా మారింది. రాజకీయ వైరం ఉన్నా వ్యక్తిగత గౌరవం మరువకూడదనే సందేశాన్ని ఈ భేటీ ఇస్తోందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. కేసీఆర్, మంత్రుల మధ్య జరిగిన ఈ ఆత్మీయ సంభాషణ జాతర వేడుకల్లో ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మొత్తానికి, మేడారం జాతర నేపథ్యంలో జరిగిన ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో ఒక సానుకూల మార్పుకు నాంది పలికిందని చెప్పవచ్చు. సంప్రదాయబద్ధంగా సాగిన ఈ ఆహ్వాన ప్రక్రియతో అమ్మవార్ల ఆశీస్సులు అందరికీ ఉండాలని భక్తులు ఆశిస్తున్నారు. కేసీఆర్ రాక కోసం మేడారం ఎదురు చూస్తోందని, త్వరలోనే ఆయన పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఖరారు కావచ్చని తెలుస్తోంది.



## బంచరాయి తండాలో వెలుగుల విప్లవం

- **సర్పంచ్ బాదావత్ కమ్లిపుల్య నాయక్ గారి అద్భుత పాలన**
- **ప్రజల అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇచ్చే నాయకత్వం**
- **చీకటిని తరిమికొట్టి భద్రతకు భరోసా కల్పించిన పాలన**

**కురవి, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయి తండ గ్రామ పంచాయతీ అభివృద్ధి బాటలో వేగంగా ముందుకు సాగుతోంది. గ్రామ ప్రజల అవసరాలే ప్రథమ ప్రాధాన్యంగా భావిస్తూ గౌరవనీయులు సర్పంచ్ బాదావత్ కమ్లి పుల్య నాయక్ చేపడుతున్న నిర్ణయాలు గ్రామానికి కొత్త వెలుగులు తెస్తున్నాయి. ఆయన సమర్థవంతమైన పాలనతో బంచరాయితండ ఆదర్శ గ్రామంగా రూపుదిద్దుకుంటోంది. గ్రామంలో రాత్రివేళ చీకటి కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన సర్పంచ్ కమ్లి పుల్యా ప్రజల భద్రతను పెంపొందించాలనే సంకల్పంతో గ్రామమంతా వీధి దీపాల ఏర్పాటు కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టారు. ప్రధాన వీధుల నుంచి పక్క వీధుల వరకు ప్రతి ప్రాంతం వెలుగులతో నిండిపోయింది. ప్రస్తుతం రాత్రి సమయాల్లో కూడా తండ వీధులు పట్టణాలను తలపించేలా ప్రకాశిస్తున్నాయి. వీధి దీపాల ఏర్పాటు వల్ల మహిళలు, వృద్ధులు, విద్యార్థులు నిశ్చింతగా సంచరించే పరిస్థితి ఏర్పడింది. రాత్రి వేళ జరిగే చిన్నపాటి ప్రమాదాలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే వ్యాపారులు కూడా రాత్రివేళ తమ పనులు నిర్భయంగా నిర్వహించగలుగుతున్నామని చెబుతున్నారు. గ్రామాభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడని సర్పంచ్ బాదావత్ కమ్లి పుల్య నాయక్, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పరిశుభ్రత, తాగునీరు, రహదారులు వంటి అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని గ్రామ పెద్దలు పేర్కొంటున్నారు.

# భారత్‌పై ట్రంప్ బాంబ్

( మొదటిపేజీ తరువాయి )

రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై ఏకంగా 500 శాతం వరకు అదనపు సుంకాలు విధించే అధికారం ట్రంప్‌కు లభిస్తుంది. ఇది సదరు దేశాల ఆర్థిక వ్యవస్థలపై కోలుకోలేని దెబ్బ తీసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రముఖ రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం ఈ బిల్లుకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. తాను వ్యక్తిగతంగా అధ్యక్షుడు ట్రంప్‌ను కలిసి ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. యుద్ధాన్ని ఆపడానికి రష్యాకు అందుతున్న ఆర్థిక వనరులను తుంచేయడమే ఏకైక మార్గమని గ్రాహం స్పష్టం చేశారు. ఈ బిల్లుపై వచ్చే వారమే ఓటింగ్ జరిగే అవకాశం ఉందని ఆయన వెల్లడించడంతో ప్రపంచ దేశాల్లో ఉత్కంఠ నెలకొంది. ఉక్రెయిన్‌లో పుతిన్ సాగిస్తున్న రక్తపాతానికి భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలు పరోక్షంగా సహకరిస్తున్నాయని గ్రాహం తీవ్ర ఆరోపణలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం ద్వారా ఆ దేశ ఖజానాకు భారీగా నిధులు చేరుతున్నాయని, ఆ నిధులే యుద్ధ ట్యాంకులుగా మారి అమాయకులను చంపుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ఈ దేశాలు మాస్కో నుంచి చమురు తీసుకోకుండా ఈ బిల్లు అడ్డుకట్ట వేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రష్యా ఆయిల్ కొనుగోలుదారుల జాబితాలో చైనా ప్రథమ స్థానంలో ఉండగా, భారత్ రెండో స్థానంలో కొనసాగుతోంది. పాశ్చాత్య దేశాల ఆంక్షలు ఉన్నప్పటికీ, తమ దేశ అవసరాల దృష్ట్యా భారత్ రష్యా నుంచి తక్కువ ధరకే చమురును దిగుమతి చేసుకుంటోంది. అయితే అమెరికా తాజా చర్యలు చూస్తుంటే, మిత్రదేశాలైనప్పటికీ నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని ట్రంప్ సంకేతాలు ఇస్తున్నట్లు కనిపిస్తోంది.




అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ట్రంప్ సుంకాల విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారు. గత ఏడాది కూడా భారతీయ దిగుమతులపై ఆయన అదనపు పన్నులు విధించడంతో మొత్తం టారిఫ్‌లు 50 శాతానికి పెరిగాయి. ఇప్పుడు రష్యా చమురు సాకుతో ఈ సుంకాలను 500 శాతానికి పెంచడం అంటే భారత్ ఎగుమతులు దాదాపు అసాధ్యంగానే మారుతుంది. ఇది వాణిజ్య యుద్ధానికి దారితీసే ప్రమాదం కూడా ఉంది. ప్రస్తుతం భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందాలకు సంబంధించి ఉన్నత స్థాయి చర్చలు జరుగుతున్నాయి. ఇరు దేశాల మధ్య సత్సంబంధాలు కొనసాగుతున్న తరుణంలో ఇలాంటి నిర్ణయాలు చర్చనీయాంశంగా మారాయి. ద్వైపాక్షిక సంబంధాల కంటే అమెరికా ప్రయోజనాలే ముఖ్యమని ట్రంప్ భావిస్తున్నట్లు ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ప్రతిబింబిస్తున్నాయి. ఇది అంతర్జాతీయ వాణిజ్య సమీకరణాలను పూర్తిగా మార్చివేసే అవకాశం ఉంది.

పుతిన్ యుద్ధం ఆపేందుకు సిద్ధమని పైకి చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం దాడులు కొనసాగిస్తున్నారని అమెరికా ఆగ్రహంగా ఉంది. అందుకే మాటల కంటే చేతలతో రష్యాను దెబ్బతీయాలని ట్రంప్ సర్కార్ నిశ్చయించుకుంది. రష్యా ఆర్థిక మూలాలను దెబ్బతీస్తేనే ఆ దేశం వెనక్కి తగ్గుతుందని వైట్ హౌస్ బలంగా నమ్ముతోంది. ఈ క్రమంలోనే 500 శాతం టారిఫ్‌లనే బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించడానికి సిద్ధమైంది. ఒకవేళ ఈ బిల్లుకు ఆమోదం లభిస్తే భారత్ తన విదేశీ విధానాన్ని పునరాలోచించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. అటు రష్యా నుంచి వస్తున్న చౌక చమురు, ఇటు అమెరికాతో ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యం మధ్య సమతుల్యత సాధించడం సవాలుగా మారుతుంది. అమెరికా విధించే భారీ సుంకాలు భరించడం కంటే ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవడంపై భారత్ దృష్టి సారించాల్సి ఉంటుంది. మొత్తానికి ట్రంప్ తీసుకున్న ఈ కీలక నిర్ణయం ప్రపంచ రాజకీయాలను హీటెక్కిస్తోంది. వచ్చే వారం జరగబోయే ఓటింగ్ ఫలితాలను బట్టి రష్యాఉక్రెయిన్ యుద్ధ గమనం మాత్రమే కాదు, భారత్అమెరికా వాణిజ్య భవిష్యత్తు కూడా ఆధారపడి ఉంటుంది. ఆంక్షలు, టారిఫ్‌ల ద్వారా శాంతిని స్థాపించాలన్న ట్రంప్ వ్యూహం ఎంతవరకు సక్సెస్ అవుతుందో చూడాలి.

# యూరియా కార్డుల పేరుతో నాటకాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా యూరియా కోసం రైతులు అల్లాడుతున్నారని, యాప్స్ మరియు కార్డుల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజల పక్షాన నిలబడి కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని, రైతులు చెప్పులను క్యూలో పెట్టి గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి వచ్చిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ ఇలాంటి ఎరువుల కష్టాలు రాలేదని ఆయన గుర్తు చేశారు. అప్పట్లో విత్తనాల కోసం కానీ, కరెంటు కోసం కానీ రైతులు పోరాడాల్సిన అవసరం లేకపోయేదని, కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తలకిందులైందని విమర్శించారు. యూరియా కార్డుల పేరుతో ప్రభుత్వం కొత్త నాటకాలకు తెరలేపిందని ఆయన చురకలంటించారు. మంత్రి జూపల్లి కృష్ణారావుపై కూడా కేటీఆర్ వ్యక్తిగత విమర్శలు సంధించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందన్న నమ్మకం ఆ పార్టీ మంత్రులకే లేదని ఎద్దేవా చేశారు. జూపల్లి గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ, ఆయన గెలుపుపై ఆయనకే ధీమా లేదని పేర్కొన్నారు. కొల్లాపూర్ ప్రజలు ఇప్పటికే జూపల్లిని ఇంటికి పంపాలని నిర్ణయించుకున్నారని, ఆయన కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సంతృప్తి పరచడానికే అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు.



కాంగ్రెస్ పార్టీ తీరును కేటీఆర్ మూడు ముక్కల్లో అభివర్ణించారు. ఎగవేతలు, కూల్చివేతలు, పేల్చివేతలే ఈ ప్రభుత్వ అసలు నైజమని మండిపడ్డారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ఎగవేస్తున్నారని, హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గత ప్రభుత్వం నిర్మించిన చెక్ డ్యాంలను కూడా పేల్చివేస్తున్నారని, అభివృద్ధిని అడ్డుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంటుందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నీటి పారుదల ప్రాజెక్టుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనీస అవగాహన లేదని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలోని నదులు, బేసిన్ల గురించి తెలియని వ్యక్తి కేసీఆర్‌కు నీటి పాఠాలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. కేవలం తన పాత బాస్‌ను సంతోషపెట్టడానికే పాలమూరు ప్రాజెక్టును రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ముఖ్యమంత్రి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన స్పష్టం చేశారు.

రైతు భరోసా పథకం అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ గణాంకాలతో వివరించారు. బీఆర్ఎస్ హయాంలో పదకొండు సార్లు రైతు బంధు నిధులను సకాలంలో జమ చేశామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం కేవలం ఒక్కసారి ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సాగు కుంటుపడిందని, అనేక ప్రాంతాల్లో రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వ్యవసాయ రంగం కుదేలవుతోందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవాలంటే మళ్లీ కేసీఆర్ నాయకత్వం అవసరమని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ అరాచక పాలన నుంచి విముక్తి లభించాలంటే బీఆర్ఎస్ బలోపేతం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు ఐక్యంగా పోరాడాలని సూచించారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టి, వచ్చే ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలని దిశానిర్దేశం చేశారు.

మంత్రి పదవిని కాపాడుకోవడానికే జూపల్లి కృష్ణారావు అబద్ధాలు చెప్తున్నారని కేటీఆర్ విమర్శించారు. గతంలో కేసీఆర్ నాయకత్వాన్ని ఆకాశానికెత్తిన జూపల్లి, ఇప్పుడు అవకాశవాద రాజకీయాల కోసం కాంగ్రెస్‌లో చేరి విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. కొల్లాపూర్‌లో జూపల్లి అరాచకాలను ఎదిరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచిందని, భవిష్యత్తులో కూడా ఆయనకు ప్రజలే బుద్ధి చెప్తారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. గ్యారంటీ కార్డులకే దిక్కులేని ప్రభుత్వం, కొత్తగా యూరియా కార్డులు ఇస్తామనడం రైతులను వంచించడమేనని అన్నారు. రైతుల కష్టాలను గాలికొదిలేసి, ప్రచార ఆర్భాటాలకే కాంగ్రెస్ పరిమితమైందని విమర్శించారు. క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం తక్షణమే గుర్తించి ఎరువుల కొరతను తీర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా కాంగ్రెస్ పాలన సాగుతోందని కేటీఆర్ ముగించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి, ఇప్పుడు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని, కాంగ్రెస్ అరాచకాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వివరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## ఆర్థిక అంతరాల తగ్గింపునకు సహకార వ్యవస్థ బలోపేతమే మార్గం

### ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ జె.వి. సత్యనారాయణమూర్తి

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండల కేంద్రంలో గురువారం రోజు ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ నూతన శాఖను బ్యాంక్ చైర్మన్ జె.వి. సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న ఆర్థిక అంతరాలను తగ్గించాలంటే ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేసే సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పేద, మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండే బ్యాంకింగ్ సేవలే సమాజంలో ఆర్థిక సమానత్వానికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు చిన్నం కోటేశ్వరరావు, ఆచార్య ఎన్. అంజయ్య, జొన్నలగడ్డ ప్రసాద్, ఈమని అవని, బ్రాంచ్ మేనేజర్ పి.వి. దుర్గా, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందోజు రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డితో పాటు అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి అజ్మీర హరీష్ సింగ్ నాయక్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.




# రూ. 2000 కోట్ల భూ 'భాగోతం'!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగర శివారు ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు రావడంతో అక్రమార్కుల కళ్లు ఆ విలువైన ప్రభుత్వ భూములపై పడ్డాయి. తాజాగా రంగారెడ్డి జిల్లాలో వెలుగుచూసిన భారీ భూ కుంభకోణం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. శేరిలింగంపల్లి మండలం మక్తా మహబూబ్‌పేట పరిధిలోని సర్వే నంబర్ 44లో ఉన్న సుమారు 43 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసేందుకు ఒక ముఠా అత్యంత పక్కాగా స్కెచ్ వేసింది. ఈ భూమి బహిరంగ మార్కెట్ విలువ సుమారు రెండు వేల కోట్ల రూపాయల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇంతటి భారీ విలువైన ఆస్తిని నకిలీ పత్రాల ద్వారా తమ పరం చేసుకోవాలని చూసిన కేటుగాళ్ల కుట్ర తాజాగా బయటపడటంతో అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. ఈ కుంభకోణంలో నిందితులు అనుసరించిన తీరు చూస్తుంటే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. అధికారుల అండదండలతో ఏకంగా 58 ఏళ్ల క్రితమే ఈ భూమి రిజిస్ట్రేషన్ జరిగినట్లుగా పాత తేదీలతో నకిలీ పత్రాలను సృష్టించారు. రిజిస్ట్రేషన్ రికార్డుల్లో అక్రమంగా మార్పులు చేసి, ఆ భూమిని ప్రైవేటు వ్యక్తుల పేరిట మార్చేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వానికి చెందిన అత్యంత విలువైన ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత కలిగిన అధికారులే ఈ అక్రమాల్లో కీలక పాత్ర పోషించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. వ్యవస్థలోని లొసుగులను వాడుకుంటూ కోట్ల రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు జరిగిన ఈ ప్రయత్నం చూస్తుంటే రెవెన్యూ శాఖలో అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుందో అర్థమవుతోంది.

ఈ మొత్తం వ్యవహారంలో రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కె. మధుసూదన్ రెడ్డి పాత్ర కీలకంగా ఉన్నట్లు విచారణలో తేలింది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, నకిలీ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఆయన పూర్తిస్థాయిలో సహకరించినట్లు ఆరోపణలు వచ్చాయి. పాత రికార్డులను తారుమారు చేయడం ద్వారా ప్రభుత్వ భూమిని ఇతరుల పరం చేసేందుకు ఆయన తన అధికారాన్ని దుర్వినియోగం చేశారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాఫీగా సాగిపోయేలా వెనకుండి చక్రం తిప్పిన మధుసూదన్ రెడ్డి తీరుపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖలో జరుగుతున్న ఈ అక్రమాలను పసిగట్టిన ఐజీ రాజీవ్ గాంధీ




హనుమంతు తక్షణమే స్పందించారు. ప్రాథమిక విచారణ అనంతరం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డిని విధుల నుంచి తొలగిస్తూ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారంపై లోతైన దర్యాప్తు చేపట్టాలని, ఇందులో పాల్గొన్న మిగిలిన నిందితులను కూడా కఠినంగా శిక్షించాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టబోమని ఈ చర్య ద్వారా స్పష్టమైన సంకేతాలు పంపారు.

ఈ భారీ స్కామ్‌పై స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని అక్రమంగా దక్కించుకోవాలని చూసిన వారిపై ఉక్కుపాదం మోపుతామని ఆయన హెచ్చరించారు. అధికారి మధుసూదన్ రెడ్డిపై కేవలం శాఖాపరమైన చర్యలు తీసుకుంటే సరిపోదని, ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నించడం దేశద్రోహం లాంటిదని ఆయన అభిప్రాయపడ్డారు. నిందితుడిపై తక్షణమే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి కఠిన కారాగార శిక్ష పడేలా చూడాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూముల రక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని ఈ సంఘటన ద్వారా మరోసారి స్పష్టమైంది. భూకబ్జాలు, నకిలీ రిజిస్ట్రేషన్లు చేసే వారు ఎంతటి వారైనా, వారికి సహకరించే అధికారులు ఎంతటి స్థాయిలో ఉన్నా కఠిన చర్యలు తప్పవని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. మధుసూదన్ రెడ్డి లాంటి అధికారుల వల్ల వ్యవస్థకే చెడ్డపేరు వస్తోందని, ఇలాంటి వారిని సమాజం ముందు దోషులుగా నిలబెట్టాలని ఆయన ఆదేశించారు. ఈ చర్య భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు పాల్పడాలని చూసే వారికి ఒక గుణపాఠంగా మారుతుందని భావిస్తున్నారు.

ప్రస్తుతం ఈ కుంభకోణానికి సంబంధించి పూర్తి వివరాలను సేకరించేందుకు ఒక ప్రత్యేక బృందం దర్యాప్తును వేగవంతం చేసింది. 58 ఏళ్ల క్రితం నాటి పత్రాలను ఎలా సృష్టించారు, ఈ అక్రమాల్లో మరెవరి ప్రమేయం ఉందనే కోణంలో విచారణ సాగుతోంది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని ఇతర రికార్డులను కూడా అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇవే కాకుండా గతంలో ఇంకేవైనా వివాదాస్పద భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఈ విచారణలో మరిన్ని షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. హైదరాబాద్ శివారులో భూముల రేట్లు ఆకాశాన్ని తాకుతున్న క్రమంలో, రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అవినీతికి నిలయాలుగా మారుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. అధికారుల అండదండలు లేనిదే ఇంత భారీ స్థాయిలో కుంభకోణాలు జరగడం అసాధ్యమనే వాదన బలంగా వినిపిస్తోంది. మక్తా మహబూబ్‌పేట భూముల వ్యవహారం ఒక ఉదాహరణ మాత్రమేనని, నగరవ్యాప్తంగా ఇలాంటి అనేక అక్రమ రిజిస్ట్రేషన్లు రహస్యంగా జరిగి ఉండవచ్చని సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి అన్ని కీలక ప్రాంతాల్లో భూ రికార్డుల ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడే క్రమంలో మంత్రి తీసుకున్న పీడీ యాక్ట్ నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించే విధంగా ఈ కఠిన నిర్ణయాలు ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్ శాఖల్లో పారదర్శకతను పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విరివిగా వాడాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే ఇలాంటి పాత తేదీల రిజిస్ట్రేషన్లు, రికార్డుల తారుమారు వంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. ఈ కుంభకోణం బయటపడటం వల్ల సుమారు రెండు వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తి అన్యాక్రాంతం కాకుండా నిలిచిపోయింది. ప్రభుత్వం తీసుకున్న వేగవంతమైన చర్యల వల్ల ప్రజల్లో వ్యవస్థపై నమ్మకం పెరిగింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి అక్రమాలకు తావు లేకుండా, భూముల రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కేసులో తదుపరి విచారణలో ఎవరు దోషులుగా తేలినా వారికి చట్టప్రకారం కఠిన శిక్షలు పడతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ఏళ్ల నాటి పోరాటానికి ముగింపు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మిర్యాలగూడలో జరిగిన పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసు తెలుగు రాష్ట్రాల చరిత్రలోనే ఒక చెరగని గాయం. ప్రేమించి పెళ్లి చేసుకున్నారన్న ఒకే ఒక్క కారణంతో, నిండు ప్రాణాన్ని కన్నతండ్రి పగతో బలి తీసుకోవడం ఆ రోజుల్లో ప్రతి ఒక్కరిని కదిలించింది. కులం అనే కంచె మనుషుల మధ్య ఎంతటి గోడలను కడుతుందో, ఆ గోడలు కూలకపోతే ప్రాణాలు ఎలా గాల్లో కలిసిపోతాయో ఈ ఘటన కళ్లకు కట్టినట్లు చూపించింది. అమృత తన కళ్లెదుటే భర్తను కోల్పోయి విలపించిన దృశ్యాలు నేటికీ సామాన్యుల గుండెల్లో మంటలు రేపుతూనే ఉన్నాయి. న్యాయం కోసం జరిగిన సుదీర్ఘ పోరాటంలో గతేడాది నల్లగొండ జిల్లా కోర్టు వెలువరించిన తీర్పు బాధితులకు కొంత ఊరటనిచ్చింది. ప్రధాన నిందితుడు శ్రవణ్ కుమార్‌తో పాటు ఇతర నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ కోర్టు ఇచ్చిన తీర్పు, చట్టం ముందు ఎవరూ అగ్రజులు కాదని నిరూపించింది. అయితే, న్యాయవ్యవస్థలో ఉన్న వెసులుబాటును వాడుకుంటూ నిందితులు పై కోర్టులను ఆశ్రయించడం సహజం. ఈ క్రమంలోనే శ్రవణ్ కుమార్ హైకోర్టు మెట్లు ఎక్కడం, ఇప్పుడు తాజాగా అతనికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు కావడం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. మానవీయ కోణంలో చూస్తే, ఈ బెయిల్ వార్త బాధిత కుటుంబానికి ఆశనిపాతమే అవుతుంది. ఒక నిండు ప్రాణాన్ని పొట్టనబెట్టుకున్న వారికి జైలు శిక్షే సరైన పరిహారమని నమ్మే సమాజం, ఇలాంటి పరిణామాలను జీర్ణించుకోవడం కష్టమే. అయితే న్యాయస్థానం తన పరిధిలో ఉన్న నిబంధనలను, నిందితుడి వయస్సును, అప్పీల్ విచారణకు పట్టే సమయాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకుంది. శిక్ష పడిన వ్యక్తికి కూడా తన వాదనను పైకోర్టులో వినిపించుకునే హక్కు ఉంటుందన్న రాజ్యాంగ సూత్రం ఇక్కడ అమలైంది. ఈ కేసులో అమృత పడ్డ వేదన



వర్ణనాతీతం. తన తండ్రి మారుతీరావు ఆత్మహత్య చేసుకున్నప్పుడు ఒక కూతురిగా ఆమె పడ్డ సంఘర్షణ, మరోవైపు తన భర్తను చంపిన వారిపై పోరాటం చేయాల్సిన బాధ్యత ఆమెను నిరంతరం వెంటాడుతూనే ఉన్నాయి. ఇప్పుడు శ్రవణ్ కుమార్ బయటకు రావడం వల్ల ఆమెలో మళ్లీ పాత గాయాలు రేకెత్తే ప్రమాదం ఉంది. న్యాయం గెలవాలని కోరుకునే ప్రతి ఒక్కరూ ఈ తరుణంలో అమృతకు, ప్రణయ్ కుటుంబానికి అండగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నది వాస్తవం కానీ, బాధితుల గోడును వినే హృదయం కూడా వ్యవస్థలకు ఉండాలి. అప్పీల్ విచారణ ఆలస్యమవుతుందన్న కారణంతో నిందితుడికి వెసులుబాటు కల్పించడం చట్టబద్ధంగా సరైనదే కావచ్చు, కానీ నైతికంగా ఇది సమాజానికి ఎలాంటి సందేశాన్ని ఇస్తుందన్నది ఆలోచించాల్సిన విషయం. ప్రణయ్ హత్య కేవలం ఒక వ్యక్తి హత్య కాదు, అది ఒక స్వేచ్ఛా భావజాలంపై జరిగిన దాడి. అందుకే ఈ కేసులో ప్రతి చిన్న మలుపు ప్రజల్లో ఇంతటి ఉత్కంఠను, ఆవేదనను కలిగిస్తోంది. హైకోర్టు మంజూరు చేసిన ఈ బెయిల్ తాత్కాలికమేనని, అప్పీల్ విచారణ ముగిసిన తర్వాత తుది తీర్పు ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని కోర్టు స్పష్టం చేసింది. అయినప్పటికీ, నిందితులు బయట తిరగడం వల్ల సాక్ష్యాధారాలు ప్రభావితం అవుతాయేమోనన్న ఆందోళన బాధితుల్లో ఉండటం సహజం. కట్టుదిట్టమైన షరతులు విధించినప్పటికీ, మానవ సంబంధాల కంటే కులం గొప్పదని భావించే మనస్తత్వాలు ఉన్నచోట భద్రత అనేది ఒక పెద్ద ప్రశ్న గుర్తుగా మిగిలిపోతుంది.

ఒక వైపు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నామంటున్నా, మరోవైపు ఇలాంటి పరువు హత్యలు సమాజపు చీకటి కోణాన్ని బయటపెడుతున్నాయి. ప్రణయ్ భౌతికంగా లేకపోయినా, అతని జ్ఞాపకాలు మరియు అమృత సాగిస్తున్న పోరాటం ఎందరో ప్రేమికులకు ధైర్యాన్ని ఇస్తున్నాయి. ఈ కేసులో న్యాయం ఏమాత్రం పక్కదారి పట్టినా అది వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. అందుకే ఉన్నత న్యాయస్థానాలు ఈ కేసును అత్యంత వేగంగా విచారించి బాధితులకు పూర్తిస్థాయి న్యాయం చేయాలని అందరూ కోరుకుంటున్నారు. శ్రవణ్ కుమార్ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌పై తుది తీర్పు వచ్చే వరకు ఈ ఉత్కంఠ కొనసాగుతూనే ఉంటుంది. ఈ లోపు సమాజం నుంచి వస్తున్న స్పందనలను బట్టి చూస్తే, ప్రజలు నిందితులకు కఠిన శిక్ష పడాలని బలంగా ఆకాంక్షిస్తున్నారు. చట్టం కళ్లకి గంతలు ఉండవచ్చు కానీ, ప్రజల మనసులకు వాస్తవాలు తెలుసు. ప్రాణం తీసే హక్కు ఎవరికీ లేదని, ప్రేమను గెలవనివ్వాలని కోరుకునే వారందరూ ఈ తీర్పును నిశితంగా గమనిస్తున్నారు. ప్రణయ్ తండ్రి బాలస్వామి, తల్లి ఈ వార్త విన్నప్పుడు కలిగే ఆవేదనను మనం ఊహించలేం. తమ కొడుకును పొట్టనబెట్టుకున్న వారు మళ్లీ తమ కళ్లముందే తిరుగుతారన్న ఆలోచన ఎంతటి క్షోభను మిగిలిస్తుందో అర్థం చేసుకోవాలి. కేవలం చట్టపరమైన అంశాలే కాకుండా, బాధితుల మానసిక స్థితిని కూడా వ్యవస్థలు అర్థం చేసుకోవాలి.

# పేదల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం

**నిజామాబాద్, విశాలభారతి:** నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద గల నిజాంబాద్ రూరల్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి నాలుగు మండలాలకు చెందిన 214 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి అయిన నేపథ్యంలో పేదలకు తోడుగా వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం అప్పులు చేసి తెలంగాణను దివాళా తీసిందని విమర్శించారు. వృద్ధులకు త్వరలోనే పెన్షన్ ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారని గుర్తు చేశారు. బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, రైతు భీమా, రైతు భరోసా, రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత కరెంట్ వంటి పథకాల ద్వారా పేదలు ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. మహిళల ఆర్థిక శక్తివంతతకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వ లక్ష్యం కోటి మంది మహిళలను కోటీశ్వర్లుగా తీర్చిదిద్దడమేనన్నారు. ఇందిరామహిళా శక్తి కింద డ్రాక్వా గ్రూపులు సిండికేట్‌గా ఏర్పడి బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకిస్తే నెలకు రూ.70,000 ఆదాయం వచ్చే అవకాశమున్నట్లు వివరించారు.

( మొదటిపేజీ తరువాయి )

ఈ వ్యవహారం ముదిరి పాకాన పడటంతో, మంత్రి కుటుంబం నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి మొరపెట్టుకున్నట్లు తెలుస్తోంది. కుటుంబ గౌరవం పోతుందని వారు ఆందోళన వ్యక్తం చేయడంతో, ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ఆ మహిళా ఐఏఎస్ అధికారిని తక్షణమే బదిలీ చేసినట్లు కథనాలు వెలువడుతున్నాయి. అయితే, పాలనలో పారదర్శకత ఉండాల్సిన చోట వ్యక్తిగత సంబంధాల కోసం పోస్టింగులు మార్చడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు, కరీంనగర్ జిల్లాకు చెందిన ఒక మంత్రి వ్యవహారం మరింత వివాదాస్పదంగా మారింది. మహిళా విలేకరులు, మహిళా అధికారుల పట్ల ఆయన అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని రాజ్ టీవీ ప్రత్యేక కథనాన్ని ప్రసారం చేసింది. సచివాలయంలో విధులు నిర్వహించే ఒక సీనియర్ మహిళా జర్నలిస్టును తనను ప్రేమించాలని సదరు మంత్రి వేధిస్తున్నట్లు వస్తున్న వార్తలు జర్నలిస్టు లోకంలో కలకలం రేపుతున్నాయి.

వయస్సుతో సంబంధం లేకుండా, తనకంటే చిన్నవారైన మహిళా అధికారులతో కూడా ఆయన అభ్యంతరకరంగా మాట్లాడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. అధికార మదంతో మహిళల పట్ల కనీస




గౌరవం లేకుండా ప్రవర్తిస్తున్నారని, ఆయన కార్యాలయానికి వెళ్లాలంటేనే మహిళా ఉద్యోగులు జంకుతున్నారని సమాచారం. గతంలో కూడా కొందరు మంత్రులపై ఇలాంటి ఆరోపణలు వచ్చినా, ఇప్పుడు ఏకంగా మీడియా సంస్థలు కథనాలు ఇవ్వడం గమనార్హం. ఇక సచివాలయంలో 'మాధవి' అనే మహిళ చుట్టూ తిరుగుతున్న కథనం మరో సంచలనం. ఆమెకు ప్రభుత్వంలో ఎలాంటి అధికారిక హోదా గానీ, పదవి గానీ లేదు. కానీ, సచివాలయంలో ఆమె పెత్తనం మాత్రం ఒక కేబినెట్ మంత్రి స్థాయిలో సాగుతోందని వార్తలు వస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉన్న సన్నిహిత్యమే ఆమెకు ఈ స్థాయి పవర్

# కాంగ్రెస్ క్యాబినెట్‌లో 'లవ్' వైరస్

ఇచ్చిందనే ప్రచారం విస్తృతంగా సాగుతోంది. ఉన్నతాధికారులు సైతం ఆమెకు ప్రోటోకాల్ ఇస్తున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. "సీఎం గారు చెప్పినట్లే మేము ఆమెకు ప్రాధాన్యత ఇస్తున్నాం" అని కొందరు అధికారులు పరోక్షంగా వాపోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అసలు అధికారిక పదవి లేని వ్యక్తి ప్రభుత్వ నిర్ణయాల్లో ఎలా జోక్యం చేసుకుంటారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.



తెలంగాణ రాజకీయ చరిత్రలో మంత్రుల వ్యక్తిగత జీవితాలు వివాదాస్పదం కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా ఒక ఎమ్మెల్యేపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ దీనిపై గొంతు ఎత్తింది. కానీ ఇప్పుడు సొంత మంత్రులపైనే ఇలాంటి ఆరోపణలు రావడం కాంగ్రెస్ పార్టీని ఆత్మరక్షణలో పడేసింది. ముఖ్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం "ప్రజా ప్రభుత్వం" అని చెప్పుకుంటున్న తరుణంలో, మంత్రుల లీలలు బయటపడటం ప్రభుత్వ ఇమేజ్‌ను దెబ్బతీస్తోంది. మంత్రులు తమ పరిధి దాటి ప్రవర్తిస్తుంటే ముఖ్యమంత్రి ఎందుకు మందలించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కొందరు మంత్రులైతే మహిళా అధికారుల వ్యక్తిగత ఫోన్ నంబర్లకు రాత్రి వేళల్లో మెసేజ్‌లు పంపుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే సచివాలయం రాజకీయ కేంద్రం కంటే వివాదాల కేంద్రంగా మారుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. పాలనపై పట్టు కోల్పోయి, వ్యక్తిగత సరదాల కోసం అధికారాన్ని వాడుకోవడం ప్రజాస్వామ్యానికి విఘాతమని మేధావులు హెచ్చరిస్తున్నారు. మీడియాలో వస్తున్న ఈ కథనాలపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వకపోవడం గమనార్హం. మంత్రులపై వస్తున్న ఈ ఆరోపణలను ప్రతిపక్షాలు ఆయుధంగా మార్చుకుంటున్నాయి. మహిళా భద్రత గురించి మాట్లాడే కాంగ్రెస్ నేతలు, తమ మంత్రుల తీరుపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నిస్తున్నారు. గతంలో హనీ ట్రాప్ వంటి కేసులు కూడా తెలంగాణ రాజకీయాలను కుదిపేశాయి, ఇప్పుడు కూడా అలాంటి శక్తులు ఏమైనా వెనుక ఉన్నాయా అనే కోణంలో కూడా చర్చ జరుగుతోంది.

అయితే, కేవలం మీడియా కథనాల ఆధారంగానే మంత్రులను తప్పు పట్టలేమని, కానీ బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఆరోపణలు రాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని రాజకీయ నిపుణులు అంటున్నారు.

# చోరీకి గురైన ఫోన్లపై పోలీసుల పంజా

**విశాలభారతి, మల్కాజిగిరి:**



స్థానిక పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోగొట్టుకున్న, దొంగిలించబడిన మొబైల్ ఫోన్ల రికవరీలో పోలీసులు సాధించిన అద్భుతమైన పురోగతి గురించి ఈ నివేదిక తెలియజేస్తోంది. ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ల వాడకం పెరగడంతో పాటు వాటి దొంగతనాలు కూడా ఎక్కువవుతున్న నేపథ్యంలో, సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రీ పోర్టల్ ద్వారా వీటిని కనిపెట్టడం సులభతరమైంది. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి, ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు, ఎల్బీ నగర్ మరియు మల్కాజిగిరి సిసిఎస్ విభాగాల్లో ఐటి సెల్ సహకారంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు గత ఆరు నెలల కాలంలో తీవ్రంగా శ్రమించి, సుమారు 2 కోట్ల 8 లక్షల రూపాయల విలువ చేసే 1039 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నాయి. ఇందులో ఎల్బీ నగర్ పరిధిలో 739 ఫోన్లు, మల్కాజిగిరి పరిధిలో 300 ఫోన్లు ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు మొత్తం 4733 ఫోన్లను రికవరీ చేయడం విశేషం. ఈ క్రమంలో జనవరి 8, 2025న మల్కాజిగిరి పోలీసులు రికవరీ చేసిన ఫోన్లను వాటి అసలైన యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ బాధితులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. తమ ఫోన్లను తిరిగి పొందిన యజమానులు పోలీసుల పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ భారీ రికవరీ కార్యక్రమంలో డిసిపి క్రైమ్స్ కె. గుణ శేఖర్, అదనపు డిసిపి రామేశ్వర్, ఎసిపి కరుణ సాగర్, ఐటి సెల్ అధికారులు కీలక పాత్ర పోషించారు. మొబైల్ ఫోన్ల భద్రత విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. సరైన బిల్లులు లేని ఫోన్లను కొనడం లేదా అమ్మడం నేరమని, దొంగిలించిన ఫోన్లను నేరస్థులు సైబర్ క్రైమ్స్ కోసం వాడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రయాణాల్లో ఉన్నప్పుడు ఫోన్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని, 'ఫైండ్ మై డివైజ్' వంటి సెట్టింగులను వాడుతూ, డేటాను ఎప్పటికప్పుడు బ్యాకప్ చేసుకోవాలని కోరుతున్నారు. ఫోన్ పోయిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడం ద్వారా CEIR పోర్టల్ సహాయంతో వాటిని త్వరగా కనిపెట్టవచ్చని అధికారులు వెల్లడించారు.

## దశదిన కర్మలకు హాజరైన తోలెం రమాదేవి సర్పంచ్



**విశాలభారతి, కరకాగూడెం:** మండలంలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన కి॥శే బండారి బాబు కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఈరోజు వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన భట్టుపల్లి గ్రామ పంచాయతి సర్పంచ్ శ్రీమతి తోలెం రమాదేవి ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబెర్స్ పూజారి స్వరూప అనూష భట్టుపల్లి కాంగ్రెస్ పార్టి గ్రామ అధ్యక్షుడు కరకపల్లి నాగేశ్వరరావు యూత్ కాంగ్రెస్ నాయకులు సూర సంతోష్ తెలుగుదేశం పార్టి భట్టుపల్లి అధ్యక్షులు ఆవుదొడ్డి శ్రీనివాస్ మరియు కాంగ్రెస్ పార్టి కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థికి దక్కిన గౌరవ పి.హెచ్.డి డాక్టరేట్



**పాల్వంచ, విశాలభారతి:** పాల్వంచ మండలం, కొత్త సూరారం గ్రామానికి చెందిన గుగులోత్.రాంజీకౌసల్య దంపతుల చిన్న కుమారడు అయిన గుగులోత్.సుధాకర్ మధ్యప్రదేశ్ రాష్ట్రం, ఇండోర్ లోని ప్రతిష్టత్మకమైన మల్వంచల్ విశ్వవిద్యాలయం నుండి మెడికల్ బయోకెమిస్ట్రీ లోని అత్యంత క్లిష్ట తరమైన " సర్క్యులిఫ్గ్ మైక్రో ఆర్.యన్.ఎ యాజ్ నోవెల్ బయోమార్క్స్ ఆఫ్ మినిరల్ బోన్ డిజర్డర్ అండ్ వాస్క్యులార్ క్లారిఫికేషన్ ఇన్ పేషంట్ విత్ క్రానిక్ కిడ్ని డిసిజేస్" అనే అంశముపై చేసిన పరిశోదనకు గాను గౌరవ పి.హెచ్.డి డాక్టరేట్ ప్రధానం చేయడం జరిగింది. అదేవిధముగా జిపమార్ విశ్వవిద్యాలయం పాండిచ్చేరి నుండి మెడికల్ బయోకెమిస్ట్రీ నందు పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ పొందడం జరిగింది. ప్రస్తుతం గుగులోత్.సుధాకర్ ప్రభుత్వ వైద్య కళాశాల, పాల్వంచ యందు మెడికల్ బయోకెమిస్ట్రీ డిపార్ట్మెంట్ నందు లెక్షరర్ గా పనిచేయుచున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా అన్నయ్య గుగులోత్. రాందాస్ ఆశయాలకు అనుగుణంగా నేను ఈ రోజు ఈ స్థాయికి రావడం జరిగింది అని విశాలభారతికి వివరణ ఇవ్వడం జరిగింది.

## నేడు పలు ప్రాంతాలలో కరెంటు అంతరాయం

**ఆవుల సతీష్ ఏఈ**

**చౌటుప్పల్ విశాలభారతి:** మండలంలోని నేడు పలు ప్రాంతాలకు కరెంట్ అంతరాయం కలుగునని చౌటుప్పల్ ఏఈ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌటుప్పల్ మండలంలోని సబ్ స్టేషన్లో వివిధ మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 8గంటల నుండి 1 గంటల వరకు మండలంలోని చౌటుప్పల్ టౌన్,చిన్న కొండూర్,జిబ్లక్ పల్లి అగ్రికల్చర్, అంకిరెడ్డి గూడెం, తాల్లసింగరం,లింగోజిగూడెం గ్రామాలలో అన్ని రకాల విద్యుత్ వినియోగ దారులకు అంతరాయం కలుగునని వారు తెలిపారు.

## ముస్లిం మైనార్టీ అధ్యక్షుల నియామక పత్రాల అందజేత



**కోదాడ, విశాలభారతి:** కోదాడ నియోజకవర్గం ముస్లిం మైనారిటీ అధ్యక్షులు బాజాన్ ఆధ్వర్యంలో టీపీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మి నారాయణ రెడ్డి చేతుల మీదుగా నడిగూడెం మండలం వల్లాపురం గ్రామానికి చెందిన లాల్ పాషాకి ముస్లిం మైనారిటీ ఉపాధ్యక్షులుగా గురువారం నియామక పత్రం అందచేయడం జరిగింది. కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన షేక్ సైదాబాబుకి కోదాడ మండల ముస్లిం మైనారిటీ ఉపాధ్యక్షులు గా నియామక పత్రం అందచేయడం జరిగింది ఇట్టి కార్యక్రమం లో కోదాడ మండల ముస్లిం మైనారిటీ అధ్యక్షులు ఖలీల్, కోదాడ టౌన్ ఉపాధ్యక్షులు ఆలీ, కోదాడ టౌన్ నాయకులు ఫిరోజ్ కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని 17 వార్డు అధ్యక్షుడు దాదావలి, నాసర్ లతీఫ్ లాల్ పాషా గాలిబ్ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించాలి

**బోధన్‌లో అవగాహన ర్యాలీ**



**నిజామాబాద్, విశాలభారతి:** రోడ్డుపై ప్రయాణం చేసే ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలు, నిబంధనలు పాటించాలని బోధన్ ఎంవి ఐ డి శ్రీనివాస్, ఏసిపి శ్రీనివాసులు కోరారు. జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా గురువారం బోధన్ పట్టణంలోని ఆచన్పల్లి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ముందుగా ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఆచన్ పల్లి లో నిర్వహించిన సమావేశంలో ఎంవీఐ శ్రీనివాస్ మాట్లాడారు. రోడ్డుపై ప్రయాణించే పాదాచారులతోపాటు వాహనదారులు కూడా రోడ్డు నియమాలు పాటించాలని అన్నారు. దీంతో ప్రమాదాలు జరిగేందుకు తక్కువ అవకాశాలుంటాయని సూచించారు. ప్రతి వ్యక్తి తన కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని, త్రిబుల్ రైడింగ్ చేయవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. కార్యక్రమంలో బోధన్ ఎంవీఐ శ్రీనివాస్, ఏసిపి శ్రీనివాస్, బోధన్ పట్టణ సిఐ వెంకటనారాయణ, ఎక్సైజ్ సీఐ భాస్కరరావు తోపాటు బోధన్ డివిజన్లోని ఎస్సైలు, పోలీసులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



**నిజామాబాద్, విశాలభారతి:** రానున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా గురువారం బోధన్ పట్టణంలోని వివిధ వార్డుల్లో గల పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ పరిశీలించారు పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు మౌలిక వసతులను ఆయన పరిశీలించారు అధికారులకు పలు సూచనలు చేశారు ఏ టువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు పోలింగ్ కేంద్రాల వద్ద త్రాగునీటి సౌకర్యం విద్యుత్తు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని తగు చర్యలు చేపట్టాలని సూచించారు ఆయన వెంట డి ఈ యోగేష్ తదితరులు ఉన్నారు.

## డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు కృషిచేయాలి



- పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి
- మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దు
- విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

**విశాలభారతి, అంతర్గం:**

గురువారం పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ రూల్స్, సైబర్ క్రైమ్స్, మత్తు పదార్థాల వలన కలుగు అనర్థాల పై అవగాహన లో భాగంగా సే నో టూ డ్రగ్స్ అనే నినాదం తో గురువారం అంతర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని టిటిఎస్ అంతర్గం రామాలయం గ్రౌండ్ లో అంతర్గం పోలీస్ ఆధ్వర్యంలో గంజాయి మత్తుపదార్థాల నియంత్రణ, సైబర్ క్రైమ్స్, ట్రాఫిక్ రూల్స్, రోడ్డు సేఫ్టీ పై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రజలతో విద్యార్థులతో మాట్లాడుతూ.విద్యార్థి దశ నుండే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని లక్ష సాధన దిశగా అడుగులు వేయాలని, విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని, మత్తు పదార్థాలైన గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు తీసుకుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలకు చేరుకుని తల్లి దండ్రులకు గురువులకు మంచి పేరు తేవాలని సూచించారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని వీటి వినియోగం వలన తమ జీవితాలను అంధకారం చేసుకోవడంతో పాటు, ఆరోగ్య, ఆర్థిక పరంగా చాలా నష్టపోతారని, ముఖ్యంగా మీ కోసం జీవించే తల్లిదండ్రుల సంతోషాన్ని దూరం చేస్తారని, మీ గ్రామాలలో, మీ చుట్టూ ప్రక్కల ప్రాంతం లో ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగిస్తున్న, విక్రయిస్తున్న తక్షణమే స్థానిక పోలీసులకు, నార్కోటిక్ విభాగం 1908 నంబర్ కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యం వుంచబడుతుందని డిసీపీ తెలిపారు. సైబర్ నేరాలపై డిసీపీ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో నేర గాళ్ళు టెక్నాలజీ వినియోగించుకొని నేరాలకు పాల్పడు తున్నారని, గుర్తు తెలియని వ్యక్తుల నుండి మీ సెల్ ఫోన్లకు, ఈమెయిల్ కు వచ్చే సందేశాల పట్ల అప్రమత్తం వుండాలని. తెలియని వెబ్ సైట్లలో మీ వ్యక్తిగత సమాచారం, ఫోటోలను పోస్ట్ చేయవద్దని, ప్రధానం గుర్తు తెలియని వ్యక్తులతో ఆన్ లైన్ ద్వారా ఎలాంటి లావాదేవీలు జరపవద్దని, అలాగే పెట్టుబడులు పెట్టవద్దని డీసీపీ సూచించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ కళాబృందం సభ్యులు రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్, సైబర్ క్రైమ్స్, మూఢనమ్మకాలు, గంజాయి వంటి మత్తుపదార్థాల వలన కలుగు అనర్థాలపై పాటల రూపంలో నాటకాల రూపంలో స్కిట్ చేసి ప్రజలలో అవగాహన చైతన్యం కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామగుండం సిఐ ప్రవీణ్ కుమార్, అంతర్గం ఎస్ ఐ వెంకటెట్, 300 మంది మండలం ప్రజలు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల అక్రమాలపై ప్రశ్నిస్తే నోటీసులా..?

- మీడియాను భయపెట్టే ప్రయత్నం సరికాదు
- మాల జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చందా శ్రీనివాస్

**మహబూబాబాద్, విశాలభారతి:**



మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో జరుగుతున్న ప్రభుత్వ భూముల అక్రమాలపై ఆధారాలతో వార్తలు ప్రచురించిన జర్నలిస్టు బోయిని నరేందర్ ముదిరాజ్‌కు లీగల్ నోటీసులు పంపడం సరికాదని తెలంగాణ మాల జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు చందా శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. గురువారం కురవి మండల కేంద్రంలో తెలంగాణ మాల జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టు నరేందర్ ముదిరాజ్ సంఘానికి తెలిపిన వివరాల ప్రకారం, కురవి మండలంలోని 747 సర్వే నంబర్‌కు చెందిన విలువైన ప్రభుత్వ భూమిని సుమారు మూడేళ్ల క్రితం ఓ రెవెన్యూ శాఖ ఉద్యోగి అక్రమంగా విక్రయానికి గురి చేసిన విషయాన్ని జర్నలిస్టులు పక్కా ఆధారాలతో వెలుగులోకి తెచ్చారని తెలిపారు. ప్రభుత్వ భూముల అక్రమాలపై ప్రశ్నించిన జర్నలిస్టుకు లీగల్ నోటీసులు పంపడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, ఇది స్వేచ్ఛాయుత మీడియాను భయపెట్టే ప్రయత్నంగా ఆయన అభివర్ణించారు. ప్రజల తరఫున ప్రశ్నించే మీడియాను అణచివేయాలని చూస్తే జర్నలిస్టు సంఘాలు మౌనంగా ఉండవని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో తెలంగాణ మాల జర్నలిస్టు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేతమళ్ళ సహదేవ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు బొడ్డు అశోక్, జిల్లా నాయకులు గండమాల రోషయ్య, జర్నలిస్టు బోయిని నరేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అసంపూర్తిగా గ్రామ పంచాయతీ భవనం



- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని పనులు
- కొత్త సర్పంచ్ ఆధ్వర్యంలో పూర్తి అయ్యేనా

**మర్పల్లి, విశాలభారతి:**

గ్రామస్తుల సౌకర్యార్థం ప్రభుత్వం మంజూరు చేసిన నూతన గ్రామ పంచాయతీ భవనం పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం పూర్తి కాకపోవడంతో అరకొర వసతుల మధ్య పాలన కొనసాగుతోంది.మండలంలో నీ కోతాలపుర్ కొత్త పంచాయతీ భవన నిర్మాణానికి గత కొన్ని ఏళ్ల క్రితం పునాది పడింది. అప్పట్లో పనులు వేగంగానే ప్రారంభమైనప్పటికీ, స్లాబ్ వేసిన తర్వాత అర్థాంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం వర్షపు నీరు చేరి నాణ్యత దెబ్బతింటోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల్లో సర్పంచ్గా గెలుపొందిన అభ్యర్థి చెట్టుకింద ప్రమాణస్వీకారం చేశారు. గత కొన్ని నెలల నుంచి పంచాయతీ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుంది. పంచాయితీ భవన నిర్మాణ పనుల గురించి గ్రామపంచాయతీ కార్యదర్శిని సంప్రదించగా సమాచారం ఇస్తానని చెప్పి మరుసటి రోజు ఫోన్ ఎత్తడం లేదు సమాచారాన్ని గోప్యంగా ఉంచడానికి పంచాయతీ కార్యదర్శి ప్రయత్నిస్తున్నట్లు అర్థమవుతుంది. లక్షల రూపాయల ప్రజా ధనం వెచ్చించి సగం వరకు నిర్మించిన ఈ భవనాన్ని ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేసి, వీలైనంత త్వరగా భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని వేడుకుంటున్నారు

## కోదాడలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయం



**కోదాడ, విశాలభారతి:** కోదాడ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని కోదాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోకాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు నిరుపేదల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని తెలిపారు గృహలక్ష్మి గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇండ్లు ,కళ్యాణ లక్ష్మి రైతులకు సబ్సిడీ రుణాలు సన్న వడ్లపై బోనస్ ధాన్యం కొనుగోలు బోనస్ పిచ్చి రైతులను ఆదుకుందని తెలిపారు రాబోవు రోజుల్లో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కోదాడ శాసన సభ్యురాలు నలమాద పద్మావతి రెడ్డి పూర్తి సహాయ సహకారంతో మున్సిపాలిటీలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి పనులు చేపడతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

## నకిలీ ధృవీకరణ పత్రాల కేసులో ఒకరు అరెస్ట్

**సీఐ ఇచ్చోడ రమేష్**




**అదిలాబాద్, విశాలభారతి:** సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ ఆధార్ కార్డు, నివాస ధృవీకరణ పత్రాలు జారీ చేసిన కేసులో నర్వాడే నాగ్‌సేన్ నక్సన్ (30 సం., జమిడి గ్రామం, ఇచ్చోడ)ను అదుపులోకి తీసుకున్నట్లు ఇచ్చోడ సీఐ రమేష్ తెలిపారు. నిందితుడు తాను పనిచేసే ఆధార్ సెంటర్‌లో మహారాష్ట్రకు చెందిన థాడ్ రోహిత్ బాపుకు డబ్బులు తీసుకుని సిరికొండ మండల పొన్న గ్రామానికి చెందిన వాడుగా నకిలీ పత్రాలు ఇప్పించాడని తెలిపారు. ఈ పత్రాల ఆధారంగా రోహిత్ అస్సాం రైఫిల్స్ కానిస్టేబుల్‌గా ఎంపిక కావడంతో విచారణలో నకిలీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. 07012025న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, ఇలాంటి అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్ హెచ్చరించారు.

## సాయి మందిరంలో అన్నదానం, ప్రత్యేక పూజలు




**కోదాడ, విశాలభారతి:** మండల పరిధిలోని నల్లబండగూడెం గ్రామం సాయి మందిరంలో చైర్మన్ నల్లపాటి నరసింహారావు ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజా కర్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నల్లపాటి సిద్దు శేఖర్ శ్రావణి దంపతుల కుమారుడు నిర్వాన్ రామ్ పుట్టినరోజు సందర్భంగా అన్నదాతలకు గా వ్యవహరిస్తూ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు సేవించారు. అనంతరం దేవాలయ చైర్మన్ నల్లపాటి నరసింహారావు మాట్లాడుతూ దేవాలయంలో ప్రతి గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. మాకు సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈదర నరసింహారావు, ఈదర వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, సత్యనారాయణ, వీరభద్రం (పటేల్), అర్చకులు సాయి శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థుల విజ్ఞాన విహారయాత్ర



**దేవరప్పుల, విశాలభారతి:** మండలంలోని కడవెండి, మరియు నిర్మాల హరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు సంయుక్తంగా హైదరాబాదులో విజ్ఞాన విహారయాత్ర నిర్వహించారు. ఈ పర్యటనలో సాలార్జంగ్ మ్యూజియం, చార్మినార్, మక్కా మసీద్, సెక్రెటరీయల్, హుస్సేన్ సాగర్, బుద్ధ విగ్రహం, బిర్లా మందిరాన్ని సందర్శించి, పాఠ్యాంశాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బుర్ర రమేష్, కిరణ్ కుమార్ మాట్లాడుతూ, ఇలాంటి విహారయాత్రలు విద్యార్థుల విజ్ఞాన వికాసానికి దోహదపడతాయని, తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మౌనిక, ప్రేమలత, శ్రీనివాస్, లక్ష్మణ్, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ఆటవస్తువుల వితరణ



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజుపల్లి హరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలకు సుమారు పదివేల రూపాయలు విలువ చేసే ఆట వస్తువులను కత్తుల సోమిరెడ్డి, మరియు ఆకుల పృథ్వి, బహుమతి రూపేణా అందించారు, ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు అంజయ్య బాస్కుల, మాట్లాడుతూ, మా పాఠశాలకు ఇచ్చిన ఆట వస్తువులతో పిల్లల స్కిల్స్ మరియు ఆరోగ్యపరంగా తోడు ఉంటాయని, ఈ సందర్భంగా మీ సహకారానికి మా పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్దాస్ మల్లేష్, మేకపోతుల నర్సింహా, గడ్డం రాజు, అన్నారపు యాదగిరి, ఇప్ప పృథ్వి రెడ్డి,జోగు మహేందర్, రాపాక రోషాలు, మేడ సోమరాజు, జోగు శివకుమార్, చింతల ధనయ్య, రాపాక శ్రీలత, అనిల్,మరియు యువత పాల్గొన్నారు.

## ఎంపీ కడియం కావ్యను కలిసిన గ్రామ ప్రతినిధులు



**దేవరుప్పుల, విశాలభారతి:** వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు మంత్రి కడియం కావ్యను వారి అధికారిక చాంబర్ లో సింగరాజుపల్లి గ్రామ ప్రతినిధులు కలిసి గ్రామంలోని ప్రధాన సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గ్రామ పరిధిలోని బంధం కింద ఉన్న రహదారి పూర్తిగా దెబ్బతినడంతో రైతులు తమ వ్యవసాయ పనులు నిమిత్తం అలాగే పశువులతో రాకపోకలు చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వివరించారు. ఈ సమస్యను శాశ్వత పరిష్కారంగా అక్కడ తక్షణమే వంతెన నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని వారు కోరారు. దీనిపై స్పందించిన మంత్రి కడియం కావ్య సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైతే తన ఎంపీ నిధుల కేటాయింపుల నుంచి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరాజు పల్లి గ్రామ సర్పంచ్ కొండ ఊర్మిళ మల్లారెడ్డి, ఉపసర్పంచ్ జోగు అనిల్, వార్డ్ మెంబర్ తాళ్లపల్లి వేణు, మరియు నల్ల యాదగిరి, రాపాక శ్రీశైలం, రాపాక రమేష్, సంతోష్ తోపాటు యువజన నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా బాట

**కార్యక్రమంలో పాల్గొన్న ఏఈ రాశేఖర్, సర్పంచ్ కొమరం సుగుణ**




**విశాలభారతి, కరకగూడెం:** మండలంలోని చిరుమల గ్రామపంచాయతీ రాయణపేట గ్రామం కార్యాలయంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 'ప్రజా బాట' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజశేఖర్ పాల్గొని రైతులతో నేరుగా మాట్లాడారు. లూజు లైన్లు, మిడిల్ పోల్స్, లైన్ ఎక్స్టెన్షన్, అగ్రికల్చర్ సర్వీసులకు సంబంధించిన సమస్యలను రైతుల నుంచి తెలుసుకున్నారు. విద్యుత్ లైన్లపై ఉన్న ఇబ్బందులను రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా వారంలో రెండు రోజులు ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల సమస్యలను స్వీకరిస్తామని తెలిపారు. స్థానిక ఉప సర్పంచ్ రాణి రైతులు , విద్యుత్ శాఖ లైన్మెన్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేలే పరుపైన వేళ

- ఒట్టిపోయిన మట్టి బతుకుల దీనగాద
- జానెడు పొట్ట కోసం బారెడు చాకిరి
- చెత్త కుప్పలతో దోస్తీ కడుతున్న దీన గాథలు
- ఆశలు అడుగంటిపోయి డొక్కలు ఎన్నినా బొక్క జీవులు
- కంప్యూటర్ యుగంలో కడుపు మాడిన ఎముకుల గూళ్ళు
- సర్కారు సాయం కోసం ఎదురుచూపులు





**భద్రాచలం, విశాలభారతి:**

ఇల్లు వాకిలి లేదు, సరైన బట్టలు లేవు,కూటి కోసం కోటి తిప్పలు. దుప్పట్లు ఏసి రూములు డబుల్ కాట్ మంచాలు పరుపులు బంగ్లాలు వంటివి వీరికి తెలవదు. నేలమ్మ ఒడిలో తలదాచుకుంటారు. చలి ఎండ వాన లో నరకయాతన పడుతుంటారు. మట్టి బ్రతుకుల దీనగాథ. మేడ మీద మెడ పెరిగే చూద్దామంటే మెడలు విరిగే పక్కనున్న మా గుడిచెలు పట్టు తప్పుచుండే అవి గాలికె గురుతుండే, వినండి అమ్మలారా కన రండి అయ్యలారా కూలి నాలి పేదోళ్ల గాథలు చెబుతున్న వారి బాధలు చెబుతున్నా ప్రభుత్వాలు ఎన్ని మారిన నిరుపేదల బతుకులు మారని వైనం కనిపిస్తుంది .పారేసిన ఎంగిలి ఇస్తర్లను ఏరుకొచ్చుకొని పొట్ట పోసుకొని జీవించే ఎన్ని దీనకాదులు మన కళ్ళముందే తారాస పడుతున్నాయి. కారులో షికారు చేసే విలాసవంతమైన జీవితాలు కొన్ని అయితే ,మసి బారిన అన్నార్తులు ఎందరో మరి ఎందరో కన్నీటి పర్యంతం కనిపిస్తుంది .గంజి మెతుకుల కోసం ఒంటినిండా చెమటను నింపుకొని రెక్కలు ముక్కలు చేసుకున్న నోటి కాడికి పట్టెడన్నం దొరకటమే కరువయ్యే కాలమైంది. చెమట చుక్కలు రాల్చని వాళ్లు రాజ్యాలను ఏలుతున్నారు. చెమటనే నమ్ముకొని బ్రతుకీడుస్తున్న వాళ్ల కు అన్నం మెతుకులే కరువైన పరిస్థితి కనిపిస్తుంది .మండే ధరలు ఒకవైపు, అవినీతి అక్రమాలు మరోవైపు, పేదోడి రక్త మాంసాలను మరిగిన రాబందుల రాజ్యం ఇది .బక్కోడి ఎముకలను జుర్రుకొని చలువ రాతి మేడలను కట్టే ధన స్వాముల దౌర్జన్యాలను ఆపే వాడే కరువైపోయాడు .ఏలేటోడు ఉన్నోడికి ఊడిగం చేసే అంతకాలం ఈ వ్యవస్థలో మార్పు రాదు. ఎన్ని జీవితాలు అర్ధాకలితో అలమటిస్తుంటే ,కన్నీటితో విలపిస్తుంటే, ఎవరి దోపిడీ వారిది ..,ఎవరి ఆక్రమణ వారిది ,ఎవరి దౌర్జన్యం వాళ్ళది ,గుడిసె కూడా లేని కొన్ని తనువులు తగలబడి పోతుంటే ఆ అర్ధనాదాల అరుపును కూడా పైశాచిక ఆనందాన్ని పొందే ప్రేతాత్మలు ఉన్నారు. మద్యం, ఇసుక ,మట్టి ,లంచగొండి ,అవినీతి ,అక్రమాల, దోపిడి దారుల్లో ఈ వ్యవస్థ కీలుబొమ్మగా మారింది .ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లిన పేదోడికి అన్యాయమే జరుగుతుంది. ఉన్నోడు పోతే రాచ మర్యాదల తో ఏ పనినైనా క్షణాల్లో చేసే చీకటి వ్యవస్థ ఉన్నంతకాలం పేదోడి తలరాత మారదు. కష్టజీవుల కన్నీటి గోడు ఇకనైనా ఈ ప్రభుత్వాలు పట్టించుకొని నిరుపేదలు లేనట్టి సమ సమాజ స్థాపన నిర్మాణం జరగాలని పేదల రాజ్యం రావాలని ఆశిద్దాం.

## న్యాయసేవాధికార సంస్థ, ట్రాఫిక్ పోలీస్ సంయుక్తంగా సదస్సు




**విశాలభారతి, గోదావరిఖని:** రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమం లో భాగంగా భవిష్యత్తు లో రోడ్డు ప్రమాద రహిత సమాజం, ప్రమాదాలలో మరణాలు నియంత్రణ లక్ష్యంతో మండల న్యాయసేవాధికార సంస్థ, గోదావరిఖని ట్రాఫిక్ పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు రహదారి భద్రత, న్యాయ పరమైన అంశాలు, ట్రాఫిక్ నియమాలపై అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్ట్ ఆవరణలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం కి అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి డాక్టర్ టి. శ్రీనివాసరావు, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ లు ముఖ్య అతిథులు గా హాజరయ్యారు.ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో జడ్జి మాట్లాడుతూ.ట్రాఫిక్ నియమాల పాటించడం వల్ల ప్రమాదాలను ఎలా నివారించవచ్చో, హెల్మెట్ , సీట్ బెల్ట్ వినియోగం ప్రాధాన్యత, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే ప్రమాదాలు, మైనర్లు వాహనాలు నడపడం వల్ల ఎదురయ్యే న్యాయపరమైన సమస్యలపై విద్యార్థులకు స్పష్టంగా వివరించారు. అలాగే రోడ్డు ప్రమాదాల సందర్భంలో చట్టపరమైన హక్కులు, బాధ్యతలపై న్యాయ సేవాధికారులు అవగాహన కల్పించారు. జడ్జి, పోలీస్ అధికారులతో కలిసి జెండా ఊపి అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్ట్ నుండి గాంధీ చౌక్ వరకు విద్యార్థులతో కలిసి రహదారి భద్రతపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమం లో డా. టి. శ్రీనివాస్ రావు అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి, గోదావరిఖని, ఐ.సురత్ రాజ్ సింగ్, సెషన్స్ న్యాయమూర్తి, ఎన్. వెంకట సచిన్ రెడ్డి, ప్రధాన న్యాయమూర్తి (ప్రిన్సిపల్ జడ్జి), కోర్ట్ సిబ్బంది, ప్రభుత్వ, శ్రీ చైతన్య మహర్షి డిగ్రీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**



**రాజేంద్రనగర్, విశాలభారతి:** రాజేంద్రనగర్ నియోజక వర్గ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కార్యాలయంలో రాజేంద్రనగర్ సర్కిల్ కి సంబంధించిన టీజీఎస్ పీడీసీఎల్ విద్యుత్ అధికారులు నియోజకవర్గం ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది అనంతరం ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.... సమస్యలపై బస్తీ పర్యటనలు భాగంగా నేరుగా ప్రజలతో మమేకమై ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని పలు కీలకమైన అంశాలు, సమస్యల పై చర్చించడం జరిగింది. అదే విధంగా డివిజన్ పరిధిలోని ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్స్ మార్పిడి మరియు దెబ్బతిన్న స్తంభాలు సింగిల్ ఫేస్ కారణంగా ఇబ్బంది పడుతున్న తదితర సమస్యలపై కార్పొరేటర్ అధికారులకు వివరిస్తూ పలు సమస్యలను వివరించి పలు ప్రాంతాలను పర్యటించి వీలైనంత త్వరగా డివిజన్లోని సమస్యలన్నీ పరిష్కరించాలని తెలియజేయడం జరిగింది. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన అధికారులు వీలైనంత త్వరగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ ఈ శ్రీరాం మోహన్, డి ఈ ఎస్ రత్నాకర్, చంద్ర శేఖర్, భాస్కర్, ఏ డి ఈ ఈశ్వర్ ప్రసాద్, ఏ ఈ ఎస్ సతీష్, సాయి కుమార్, నరసింహ, అరీఫ్, వినోద్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## పల్లెల నుంచి రాష్ట్ర స్థాయి విజేతల దిశగా అడుగులు

**అబ్దుల్లాపూర్మెట్‌లో ఎమ్మార్వో ఆధ్వర్యంలో సీఎం కప్ టార్చ్ రిలే స్వాగతం**




**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్స్ కప్ టార్చ్ రిలే కార్యక్రమానికి అబ్దుల్లాపూర్మెట్ మండలంలో ఘనంగా స్వాగతం తెలపడం జరిగింది . బుధవారం రోజు ఉదయం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైన టార్చ్ రిలే హయత్ నగర్ మండలం మీదుగా అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలోని పెద్ద అంబర్ పేట్ జెసీబీ షోరూం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు చేరుకోగా, ఈ స్వాగత కార్యక్రమాన్ని అబ్దుల్లాపూర్మెట్ మండల ఎమ్మార్వో ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మండల ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి, మండల విద్యాధికారి (ఎంఈఓ) జగదీశ్వర్, వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టితో పల్లెల నుంచే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దే లక్ష్యంతో సీఎం కప్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల వరకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. అర్హులైన గ్రామీణ క్రీడాకారులు ఈ నెల 16వ తేదీలోపు ఆన్లైన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ యూత్ ఆఫీసర్ ఎర్రవల్లి వెంకటేశ్వర రావు, అబ్దుల్లాపూర్మెట్ మండల ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి, మండల ఎంఈఓ జగదీశ్వర్, అబ్దుల్లాపూర్మెట్ మండలం ఆర్ఐ ప్రేమ్ కుమార్, పెద్ద అంబర్ పేట్ హెచ్ఎం రాజశేఖర్, రాజశ్రీ విద్యా మందిర్ ఇన్‌చార్జ్ కరణ్, ఫిజికల్ డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, డాక్టర్ సోలపోగుల స్వాములు, గోపి, నీలేశ్వర్, లక్ష్మీనారాయణ, విష్ణుమూర్తి, రవీందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ శిక్షకులు, సిబ్బంది, క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యమకారుల కమిటీ కన్వీనర్‌గా కప్పాటి పాండురంగారెడ్డి



**రంగారెడ్డి, విశాలభారతి:** తెలంగాణ ఉద్యమ కారుల సమస్యలపై అధ్యయనం చేయడానికి తెలంగాణ జాగృతి ఏర్పాటు చేసిన ఉద్యమకారుల సంక్షేమ అధ్యయన కమిటీ కన్వీనర్ గా జాగృతి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయినంత వరకు ఉద్యమంలో ఉద్యమ కారుడిగా,ఉద్యమ నాయకుడిగా పనిచేసిన అనుభవం ఉండడంతో ఆయనకు అధ్యక్షురాలు ఈ బాధ్యత అప్పగించినట్లు తెలుస్తుంది.ఈ కమిటీలో ననావత్ రాజేష్ నాయక్( ములుగు జిల్లా), బండారు శ్రీనివాస్ గౌడ్ (పెద్దపల్లి జిల్లా), సాలం వీరేందర్ (మేడ్చల్ జిల్లా) లు సభ్యులుగా వ్యవహరించనున్నారు .ఈ సందర్భంగా కప్పాటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ జాగృతి నూతన ప్రాంతీయ రాజకీయ పార్టీగా రూపు దిద్దుకునే దిశగా కీలక అడుగులు వేస్తోందని, పార్టీ ఏర్పాటు నేపథ్యంలో ప్రజల సమస్యలను లోతుగా అధ్యయనం చేసేందుకు తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ సుమారు 30 అంశాలతో కూడిన అధ్యయన కమిటీలను ఏర్పాటు చేశారన్నారు. తెలంగాణలో ఉన్న వేలాదిమంది ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేయడం ఈ కమిటీ ప్రధాన లక్ష్యంగా ఉండనుందన్నారు.తెలంగాణలో ఉద్యమకారులు ఎదురుకొంటున్న సమస్యలు, ప్రభుత్వ హామీలు, వారి స్థితిగతులు, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాత కూడా నెరవేరని న్యాయ బద్ధమైన అంశాలపై విస్తృతంగా అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. తనపై నమ్మకం తో ఈ బాధ్యత అప్పగించిన అధ్యక్షురాలు కవితకు కృతజ్ఞతలు తెలిపారు.

## దొడ్ల మిల్క్ మానేజర్ శ్రీనివాస్‌పై దాడి

- శ్రీకర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న శ్రీనివాస్
- శ్రీనివాస్ పరిస్థితి విషమం

**కీసర,విశాల భారతి :**




కీసర ప్రధాన కూడలిలో గురువారం తెల్లవారు జామున దొడ్ల మిల్క్ మేనేజర్ శ్రీనివాస్ పై తల్వార్ తో దాడి చేసిన కీసరకు చెందిన కిరణ్ అనే పాల వ్యాపారి.విషయం తెలుసుకున్న కీసర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉండడంతో నగరంలోని శ్రీకర హాస్పిటల్ కి తరలించిన పోలీసులు.బాధితుడు శ్రీనివాస్ మౌలాలి హెచ్ బి కాలనీ వాసిగా గుర్తించిన పోలీసులు.శ్రీనివాస్ స్వస్థలం కరీంనగర్ జమ్మికుంట.కీసర సి ఐ ఆర్కపల్లి ఆంజనేయులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి కీసర అంబేద్కర్ కూడలిలో కీసరకు చెందిన పాల వ్యాపారి కిరణ్ గత కొంత కాలంగా కుటుంబంతో పాల వ్యాపారం చేస్తు జీవనోపాధి పొందుతున్నాడు.కిరణ్ కి పాలు సప్లై చేసే దొడ్ల కంపెనీకి కిరణ్ డబ్బులు బకాయి ఉన్నాడు.దొడ్ల మిల్క్ మేనేజర్ శ్రీనివాస్ కిరణ్ బకాయి ఉన్న డబ్బులు త్వరగా కట్టు చాలా రోజులు అవుతుంది గత కొన్ని రోజుల నుండి ఇద్దరి మధ్య గొడవ జరుగుతుంది అని అన్నారు.బకాయి ఉన్న డబ్బులు నీవు తప్పనిసరిగా కంపెనీకి కట్టాల్సిందే లేదంటే వేరే వారికి డిస్ట్రిబ్యూషన్ ఇస్తాను అని శ్రీనివాస్ పలుమార్లు కిరణ్ నీ హెచ్చరించారు అని తెలిపారు.ఇదే విషయంపై గురువారం తెల్లవారుజామున శ్రీనివాస్ కీసరకు తన రెడ్ కలర్ హుండాయ్ TS 08 EP 7851 కారులో కీసరకు వచ్చాడు అదే అదునుగా చూసి కిరణ్ తన పాల వ్యాన్ అడ్డుగా పెట్టి గొడవకు దిగాడు అని తెలిపారు.కిరణ్ కి శ్రీనివాస్ కి మాట మాట పెరిగి ఇద్దరి మధ్య గొడవ జరిగింది అని తెలిపారు.అనంతరం కిరణ్ తన వ్యాన్ లో ఉన్న తల్వార్ తో శ్రీనివాస్ మెడపై పలుమార్లు దాడి చేశాడు అని తెలిపారు.శ్రీనివాస్ కి కిరణ్ కి దొడ్ల మిల్క్ కి సంబంధించిన లావాదేవీలేనా అసలు ఇంకా ఏమైనా పాత గొడవలు ఏమైన ఉన్నాయా అనే కోణంలో కూడా కిరణ్ నీ విచారిస్తున్నాం అన్నారు.శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితి చాలా విషమంగా ఉంది శ్రీనివాస్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

## విలువలను మరువద్దు



**ముషీరాబాద్, విశాలభారతి:** మనిషి తన జీవితంలో విలువలను మర్చిపోకుండా సేవా కార్యక్రమాలు చేయాలని ఎమ్మెల్సీ మధుసూదనాచారి, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు. మనం చేసిన సేవా కార్యక్రమాలే తృప్తినిస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు సైనిక్పురి లోని అరవింద్, లహరిక దంపతుల కుమారుడు స్వరాజ్ జన్మదిన వేడుకలు గణేష్ చారి నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మధుసూదనాచారి హాజరై స్వరాజ్ చేత కేక్ కట్ చేపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి తన జీవితంలోని ముఖ్యమైన రోజులను గుర్తుపెట్టుకుని పలు రకాల సేవ కార్యక్రమాలు చేయాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు పేద ప్రజలకు చీరలు బట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్ల రమేష్, పడకండి సత్యనారాయణ చారి, చాణిక్య, పడగంటి నరసింహ చారి హాజరై మాస్టర్ స్వరాజును ఆశీర్వదించారు.

## అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన ఎమ్మెల్యే నివాసం

**గురు స్వామి బల్యపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజ**



**నిజామాబాద్, విశాలభారతి:** జిల్లా కేంద్రంలోని మిర్చి కాంపౌండ్ కిసాన్ వేర్ హౌస్ లో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా దంపతులతో సహా వారి కుటుంబ సభ్యులు, ఆయన తనయుడు ధన్ పాల్ ప్రణయ్ స్వామి నిర్వహించిన పడిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా, కన్నుల పండుగగా జరిగింది. ఎమ్మెల్యే స్వస్థలం కిసాన్ వేర్ హౌస్ వేదికగా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. శ్రీ అయ్యప్ప స్వామి దివ్య ఆశీస్సులతో పడిపూజ మహోత్సవాన్ని బ్రహ్మశ్రీ బల్యపల్లి సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా, కన్నుల పండుగగా నిర్వహించారు. పడిపూజ కోసం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ కిసాన్ వేర్ హౌస్ లో వారి తనయుడు ధన్ పాల్ ప్రణయ్ కుమార్ ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి పూలతో వైభవంగా అలంకరించారు. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు 41 రోజుల దీక్షలోకి ప్రవేశిస్తారన్నారు. ఈ మాలధారణ అంటే కేవలం ఆచారం కాదని, ఇది మనస్సును శుద్ధి చేసే సాధన, శరీరాన్ని నియంత్రించే నియమం అని అన్నారు. ఆత్మను ఉన్నత స్థితికి చేర్చే మార్గం అని అన్నారు.

## ఉద్యమకారుల మహాసభను జయప్రదం చేయండి



**పాల్వంచలో పోస్టర్‌ను ఆవిష్కరించిన ఉద్యమకారులు**

**పాల్వంచ, విశాలభారతి:**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో ఉద్యమ కారులకు ప్రకటించిన హామీలను నెరవేర్చాలని తెలంగాణా ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో ఈ నెల 10 వ తేది సాయంత్రం నాలుగు గంటలకు సూర్యాపేట జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర ఉద్యమకారుల మహాసభను జయప్రదం చేయాలని ఉద్యమకారులు పిలుపునిచ్చారు. గురువారం పాల్వంచ అమరవీరుల స్థూపం వద్ద ఉద్యమకారులు పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు క్రింద న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని,గుర్తింపు కార్డులు జారీ చేయాలని,నెలకు గౌరవ వేతనం ముప్పై వేల రూపాయలు అందించాలని,కేసీఆర్ పాలనలో అక్రమంగా పెట్టిన కేసులను,ఉపా కేసులతో సహా అన్నీ కేసులను భేషరతుగా ఎత్తివేయాలని,అమరవీరుల స్మృతివనం వంద ఎకరాల్లో ఏర్పాటు చేసి,సెక్రటిరియేట్ ముందున్న అమరజ్యోతి మ్యూజియంను అధికారికంగా ప్రారంభించి, సందర్శకులకు అనుమతి ఇవ్వాలని,ప్రతి జిల్లా కేంద్రంలో ఉద్యమకారులకు స్మారక భవనం నిర్మించాలని,(అస్సాం రాష్ట్రం కోక్రాబార్ లో అమర వీరుల స్థూపం వలె నిర్మించాలి)ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు భీమా సౌకర్యం కల్పించాలని,హెల్త్ కార్డులు మంజూరు చేసి,ఈయస్ ఐ సౌకర్యంతో పాటు ఉచిత బస్సు పాసులు అందచేయాలని,ఉద్యమకారుల కుటుంబాలకు ప్రభుత్వ పథకాలలో, విద్య, ఉద్యోగ, రాజకీయ పదవుల్లో మొదటి ప్రాధాన్యత ఇస్తూ, 2 శాతం రిజర్వేషన్లు కల్పించాలని,ఉద్యమసమయంలో నష్టపోయిన ఉద్యమకారులందరికి ప్రభుత్వం 50 శాతం సబ్సిడి తో కోటి రూపాయలు రుణాలు అందించి వ్యాపార అభివృద్ధికి సహకరించాలని,తెలంగాణ అమరవీరుల చరిత్రను,తెలంగాణ విద్యార్థి ఉద్యమ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలనే 12 అంశాలతో కూడిన సమస్యలను నెరవేర్చాలని సూర్యాపేట నూతన బస్టాండ్ నుండి సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ అనంతరం మహా సభ వుంటుందని రాష్ట్రం లోని ఉద్యమకారులందరు హాజరుకావాలని పిలుపునిస్తూ పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు మల్లెల రామనాథం, బరగడి దేవదానం,సయ్యద్ రషీద్, శివలెంక అశ్విని కుమార్, శ్రీపాద సత్యనారాయణ,నబీ సాహెబ్, యస్. డీ. టీ హుస్సేన్, శనగ రామచందర్ రావు, కుడికాల ఆంజనేయులు,ఉబ్బన శ్రీను, బుడగం నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

- డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడం పట్ల ఆగ్రహం
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టీకరణ
- మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశం



**నిజామాబాద్, విశాలభారతి:** ఆర్మూర్ /పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అవుట్ పేషంట్, ఇన్ పేషంట్ విభాగాలను, ఆపరేషన్ థియేటర్, శస్త్ర చికిత్స వార్డు, రిసెప్షన్ సెంటర్ తదితర వాటిని సందర్శించి వాటి పనితీరును పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్ ను తనిఖీ చేసి, విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బంది హాజరు గురించి వాకబు చేశారు. ఈ సందర్భంగా డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రికి వస్తే ఎలా అని సిబ్బందిని నిలదీశారు. ఈ తరహా నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, వైద్యులు, సిబ్బంది అందరూ విధుల్లో అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. తాను క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు జరుపుతానని, నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

## మృతుని కుటుంబానికి సాయం

**కాగజ్ ఘట్ గ్రామ వార్డు సభ్యులు కందుకూరి నాగేష్**

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా మంచాల మండలం కాగజ్ ఘట్ గ్రామానికి చెందిన పంది ప్రదీప్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. నూతనంగా ఎన్నికైన 7వ వార్డు సభ్యుడు కందుకూరి నాగేష్ మానవతా దృక్పథంతో ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి తనవంతు సాయంగా 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ......పంది ప్రదీప్ అకాల మరణం తనను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ప్రదీప్ మరణించడం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ప్రదీప్ ప్రతి ఒక్కరిని ప్రేమతో, ఆప్యాయతతో పలకరించే వాడని గుర్తు చేశారు. నిజంగా అతని మరణం ఎంతో దుఃఖకరమన్నారు. కడు పేదరికంలో పుట్టిన కుటుంబాన్ని మానవతా వాదులు ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తమకు అందించిన ఈ సాయం ఆ కుటుంబానికి బాసటగా నిలుస్తుందన్నారు. ప్రదీప్ పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని వేడుకుంటున్నట్లు పేర్కొన్నారు. అతని కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యురాలు కందుకూరి పుష్పలత, సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి కందుకూరి యాదగిరి, నక్క జంగయ్య, కందుకూరి రాజు, బుగ్గమ్మ పాల్గొన్నారు.

## పాఠశాలకు ఆటవస్తువుల పంపిణీ

**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజుపల్లి గ్రామీణ విద్యను బలోపేతం చేయడం విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ప్రోత్సహించడం అనే లక్ష్యంతో హై స్కూల్ ప్రాథమిక పాఠశాల మరియు హరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో సుమారు 40 వేల రూపాయలు విలువ చేసే ఆట వస్తువులను కాంటెస్ట్ సర్పంచ్ కత్తుల రమసోమిరెడ్డి, మరియు ఆకుల పృథ్వి, బహుమతి రూపేణా అందించారు, ఈ సందర్భంగా కాంటెస్టెడ్ సర్పంచ్ కత్తుల రమసోమిరెడ్డి మాట్లాడుతూ, మా గ్రామంలోని పాఠశాలను బలోపేతం చేయడానికి ఆట వస్తువులతో విద్యార్థుల్లో ఉన్నత స్థాయికి తోడ్పాటుకు క్రీడలపై ఆసక్తి పెరిగి, శారీరక ఆరోగ్యకరమైన జీవన శైలికి అలవాటు పడతారని,మా యొక్క ఆలోచనతో ఈ సహకారం అందించి ఇంకా ఇలాంటి విద్యాభివృద్ధి యువత అభివృద్ధి కార్యక్రమాలకు మేము ముందుండి సహకరిస్తామని, కొనియాడారు.ఈ సందర్భంగా మీ సహకారానికి మా పాఠశాల తరపున ప్రధానోపాధ్యాయులు పాఠశాలల తరపున కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ , ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు కత్తుల ప్రదీప్ రెడ్డి, గోపాల్దాస్ మల్లేష్, మేకపోతుల నర్సింహా, గడ్డం రాజు, అన్నారపు యాదగిరి, ఇప్ప పృథ్వి రెడ్డి, కొండ అఖిల్, జోగు మహేందర్, రాపాక రోషాలు, అన్నారపు ప్రశాంత్, రాగుల కృష్ణ, నోముల సతీష్,భూమాండ్ల పరశురాములు, జోక్ మహేందర్ తండ్రి బుచ్చయ్య, జోగు శివకుమార్, అనిల్, మరియు యువత పాల్గొన్నారు.



# కొండెక్కిన కోడిగుడ్డు ధర

- కోడిగుడ్లు పిల్లలకు పెట్టలేము
- ఎనిమిది నెలలుగా పెండింగ్లో జీతాలు
- పెండింగ్లో ఉన్న బిల్లులు ఇవ్వాలి
- ప్రభుత్వం కోడిగుడ్లను సరఫరా చేయాలి
- సిఐటియూ జిల్లా అధ్యక్షులు జి పద్మ




**కొత్తగూడెం, విశాలభారతి:** కోడిగుడ్డు పెట్టలేమని ఎనిమిది నెలలుగా పెండింగ్లో ఉన్న జీతాలు బిల్లులు ఇవ్వాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సిఐటియూ జిల్లా అధ్యక్షులు జి పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిఈఓ సూపర్నెంట్కి అందజేయడం జరిగినది.వారు స్పందిస్తూ కోడిగుడ్ల కు బడ్జెట్ రావడం లేదు వస్తె వేస్తాం పెండింగ్ జీతాలు వచ్చాయి ఈ రెండు రోజులలో ఎకౌంట్లో పడతాయని బిల్లులకు సంబంధించిన బడ్జెట్ రాలేదు ప్రభుత్వానికి పంపించామని రాగానే వేస్తామని చెప్పారు ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా అధ్యక్షురాలు జి పద్మ మాట్లాడుతూ ప్రభుత్వం 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను పిల్లలు తక్కువ ఉన్నారనే పేరుతో మధ్యాహ్నం భోజన కార్మికులను తొలగించడం సరైనది కాదని పిల్లలు ఊరన్నాక పిల్లలు ఒక సంవత్సరం తగ్గిన రెండవ సంవత్సరం పెరుగుతారని తగ్గినప్పుడు పిల్లలు తగ్గినప్పుడు తగ్గించడం పెరిగినప్పుడు మళ్లీ తీసుకోవడం ఇది సరైన కాదని పిల్లలు ఉన్నా లేకపోయినా మధ్యాహ్న భోజన కార్మికులను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు

మార్కెట్లో గుడ్డు ధర 9 రూపాయలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆరు రూపాయలు చెల్లిస్తుందని వారానికి మూడు గుడ్లు పెట్టాలని కార్మికుల మీద అధికారులు ఒత్తిడి చేయడం సరైనది కాదని ప్రభుత్వం కోడిగుడ్లను సరఫరా చేస్తే మేము ప్రతిరోజు గుడ్డు పెట్టడానికి సిద్ధంగా ఉన్నామనిఅన్నారు .ప్రభుత్వం చెల్లించకుండా మధ్యాహ్న భోజన కార్మికుల మీద భారాలు వేస్తే ఊరుకోమని. కోడిగుడ్లు పెట్టలేమని అధికారులకు తెలియజేశారనీ వారన్నారు జిల్లా కార్యదర్శి ఎస్ హెచ్ సుల్తానా మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్లు ఇవ్వకుండా కట్టెల మీద వంటలు చేయొద్దని అధికారులు బెదిరింపుల గురి చేయడం సరైనది కాదని గ్యాస్ సిలిండర్ ప్రభుత్వం సరఫరా చేస్తే గ్యాస్ మీద వంట చేసి పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు కోడిగుడ్లు పెట్టలేమని ప్రతి స్కూలు హెచ్ ఎం కు ఎంఈఓకి తెలియజేయాలని విద్యాశాఖ అధికారులను కార్మికులు వేడుకొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సారిక మిడ్ డే మీల్ జిల్లా కోశాధికారి వెంకట నరసమ్మ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామలక్ష్మి శివకుమారి అరుణ రాణి నజమ్మా కుమారి నిరోషా సమ్మక్క శైలజ నాగ దుర్గా ఈశ్వరమ్మ నాగుల దేవి క్రాంతి తదితరులు పాల్గొన్నారు



## చేవెళ్ల జోన్ డీసీపీగా యోగేష్ గౌతం

**నేరాలు, ప్రమాదాల నివారణకు కృషి చేస్తాం**



**మొయినాబాద్, విశాలభారతి:** ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భాగంగా చేవెళ్ల జోన్ను ఏర్పాటు చేయగా, ఆ జోన్కు డీసీపీగా యోగేష్ గౌతం గురువారం బాధ్యతలు స్వీకరించారు. చేవెళ్ల జోన్ డీసీపీ కార్యాలయాన్ని మొయినాబాద్లో ఏర్పాటు చేశారు. గతంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రాజేంద్ర నగర్ జోన్ డీసీపీగా విధులు నిర్వహించిన యోగేష్ గౌతంను, ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన చేవెళ్ల జోన్ డీసీపీగా నియమించింది. చేవెళ్ల జోన్ పరిధిలో చేవెళ్ల ఏసీపీ డివిజన్తో పాటు నూతనంగా ఏర్పాటు చేసిన మొయినాబాద్ ఏసీపీ డివిజన్ కూడా రానున్నాయి. ప్రస్తుతం చేవెళ్ల ఏసీపీ డివిజన్ కార్యాలయం చేవెళ్లలో కొనసాగుతుండగా, ఆ డివిజన్కు ఏసీపీగా కిషన్ గౌడ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నూతనంగా ఏర్పాటైన మొయినాబాద్ ఏసీపీ డివిజన్కు త్వరలోనే ఏసీపీని నియమించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఏసీపీ కిషన్ గౌడ్, సీఐలు పవన్ కుమార్ రెడ్డి, వీరబాబు, శ్రీనివాస్, ఉపేందర్, కాంతారెడ్డి, నరేందర్ రెడ్డి, ఎస్ఐలు నర్సింహారావు, వెంకన్న, నయీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఉద్యోగి మిస్సింగ్



**రాజేంద్రనగర్, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఊట్పల్లి గ్రామానికి చెందిన యాచారం రాజేందర్ (30) ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు కొన్ని రోజుల నుంచి అతను తన భార్య యొక్క అమ్మగారిల్లు అయిన జూకల్ గ్రామం నుంచి ఉద్యోగం చేస్తూ ఉండేవాడు అలాగే 05/01/2026 నాడు ఉదయం 9:30 నిమిషాలకు జూకల్ నుంచి ఉద్యోగానికి వెళ్తున్నట్లు తన కారు అయినా TG 07 C 0386 బయలుదేరినట్లు తన భార్య యాచారం శ్వేత తెలపడం జరిగింది. శ్వేత ఉదయం 11:15 నిమిషాలకు అతనికి ఫోన్ చేయగా రాజేందర్ ఫోన్ లిఫ్ట్ చేయలేదు తర్వాత ఆఫీసులో ఉన్నాను ఆఫీసులో పని ఉంది రాత్రికి కూడా ఇక్కడే ఉంటాను అని శ్వేతకు మెసేజ్ చేయడం జరిగింది. 07/01/2026 ఉదయం నుంచి తన ఫోన్ కలవకపోవడంతో ఆఫీసులో అలాగే బంధువుల దగ్గర స్నేహితుల దగ్గర యాచారం రాజేంద్రర్ గురించి అడిగి తెలుసుకోగా ఆచూకీ లభించకపోవడంతో శ్వేత శంషాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. శంషాబాద్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** అబ్దుల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని ఓ వ్యక్తి మృతి చెందడం జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..2026 జనవరి 7వ తేదీ సాయంత్రం, ఎన్హెచ్-65 రహదారిపై గండీ మైసమ్మ ఆలయం సమీపంలో విజయవాడ వైపుకు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ (TS09UD8665) అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపబడిన కారణంగా, రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యక్తి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సిమెంట్ ట్యాంకర్ డ్రైవర్పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ,దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు.

## డీజే సౌండ్ సిస్టమ్ స్వాధీనం

**ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** హయత్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగనాయకులగుట్ట ప్రాంతంలో శబ్ద కాలుష్య నిబంధనలను ఉల్లంఘిస్తూ డీజే సౌండ్ సిస్టమ్ వినియోగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకున్నట్లు హయత్నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు.2026 జనవరి 7వ తేదీన పోలీసుల తనిఖీల సమయంలో అధిక శబ్దంతో డీజే సిస్టమ్ వినియోగిస్తున్నట్లు గుర్తించామని ఆయన వివరించారు.ఈ ఘటనలో రెండు సౌండ్ బాక్స్లు, ఒక యాంప్లిఫయర్ను పోలీసులు స్వాధీనం చేసుకుని, డీజే ఆపరేటర్పై చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ పేర్కొన్నారు. శబ్ద కాలుష్యం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగడమే కాకుండా, వృద్ధులు, చిన్నపిల్లలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రభుత్వం నిర్దేశించిన శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలను ఉల్లంఘిస్తే ఎలాంటి మినహాయింపు లేకుండా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనుమతి లేకుండా డీజేలు, భారీ శబ్ద పరికరాలను వినియోగించరాదని, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## పార్సీగుట్టలో బిజెపి నాయకుల పాదయాత్ర

**సికింద్రాబాద్ ,విశాలభారతి:** పార్సిగుట్ట ,న్యూ అశోక్ నగర్, ఎల్లారాయణ నగర్ లో పాదయాత్రలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు. హనుమాన్ దేవాలయ పరిసర ప్రాంతంలో ఉన్నటువంటి చెత్త కుళ్ళిపోయిన వస్తువులను జిహెచ్ఎంసి పారిశుద్ధ కార్మికులు మందిర పరిసరాలు శుభ్రపరచడం జరిగింది .అనంతరం బస్తీలో పర్యటిస్తూ న్యూ అశోక్ నగర్ లో నిర్మాణంలో ఉన్న మూడంతస్తుల భవనం గత కొన్ని సంవత్సరాలుగా నిర్మాణ పనులను అర్ధాంతరంగా ఆపివేయుట మూలంగా ఆ భవనంలో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయని బస్తి మహిళలు విన్నవించగా వెంటనే వారాసిగూడ పోలీసు అధికారులకు విన్నవించి ఎస్సై మల్లికార్జుగౌడ్ కి బస్తి మహిళలు ఫిర్యాదు చేసి ఆ భవనంలోకి ఎవరు ప్రవేశించకుండా చూడాలని పోలీసు వారికి ఫిర్యాదు చేయడం జరిగింది.



## ప్రహరీ గోడ దూకి గొర్రెల అపహరణకు యత్నం

- సీసీ కెమెరాలతో బయటపడిన దొంగలు
- నలుగురు పోలీసుల అదుపులో

**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రహరీ గోడ దూకి గొర్రెలను అపహరించేందుకు ప్రయత్నించిన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సీసీ కెమెరాల సహాయంతో దొంగలు గొర్రెల మందలోకి చొరబడ్డ విషయం వెలుగులోకి రాగా, బాధితులు అప్రమత్తమై ఇద్దరు దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనంతరం పోలీసులు మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన సోమ సుందరయ్య వద్ద సుమారు 80 గొర్రెలు ఉన్నాయి. వెంకటేశ్వర కాలనీలోని తన సొంత ప్లాట్లో ఫ్రీకాస్ట్ ఏర్పాటు చేసి గొర్రెల మందను ఉంచుతున్నారు. నెల రోజుల క్రితం రెండు గొర్రె పొటేళ్లు, ఈ నెల 5వ తేదీన రాత్రి మరో 10 గొర్రెలు గుర్తుతెలియని దుండగులు అపహరించడంతో గొర్రెల కాపరులు అప్రమత్తమయ్యారు.తరచుగా జరుగుతున్న చోరీలను దృష్టిలో ఉంచుకుని గొర్రెల మంద వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. బుధవారం అర్ధరాత్రి సుమారు ఒంటి 2 గంటల సమయంలో సుమారు 8 అడుగుల ఎత్తు గల ఫ్రీకాస్ట్ గోడను ఎక్కి నలుగురు దొంగలు గొర్రెల మందలోకి చొరబడ్డారు. సీసీ కెమెరాల ద్వారా సుందరయ్య మనవడు సాయికుమార్ యాదవ్ ఫోన్కు అలారం రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారిని గమనించిన దొంగల్లో ముగ్గురు గోడ దూకి పారిపోగా, అల్తాఫ్ అనే దొంగ గోడ దూకే ప్రయత్నంలో గాయపడడంతో అక్కడికక్కడే బాధితులకు చిక్కాడు. అనంతరం గురువారం ఉదయం మరో దొంగ అబ్బాస్ అనే వ్యక్తిని కూడా పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

## వనస్థలిపురంలో వ్యభిచార ముఠా గుట్టు రట్టు

- హర్షిత గెస్ట్ హౌస్పై పోలీసుల దాడి
- రిసెప్షనిస్ట్ అరెస్ట్, ఇద్దరు మహిళల రెస్క్యూ
- ఒక రోజు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టక
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన




**ఎల్.బి.నగర్, విశాలభారతి :** వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యభిచార కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. విశ్వసనీయ సమాచారంతో, కమ్మగూడ ప్రాంతంలో ఉన్న హర్షిత గెస్ట్ హౌస్ లో అక్రమ వ్యభిచారం కొనసాగుతోందని గుర్తించిన పోలీసులు, ఉన్నతాధికారుల అనుమతులతో జనవరి 7న దాడులు నిర్వహించారు. దాడుల సందర్భంగా గెస్ట్ హౌస్లో ఇద్దరు మహిళలతో కలిసి వ్యభిచారాన్ని నిర్వహిస్తున్న ఆర్గనైజర్ను అదుపులోకి తీసుకున్నారు. అతను గెస్ట్ హౌస్లో రిసెప్షనిస్ట్గా పనిచేస్తున్న షేక్ ఖలీల్ సన్నాఫ్ ఇస్మాయిల్ (వయస్సు 27), మచిలీపట్నం నివాసిగా పోలీసులు గుర్తించారు. అతనిపై PITA కేసు క్రైమ్ నెంబర్ 41/2026 కింద, బీఎన్ఎస్ సెక్షన్ 143(1), ఇమ్మోరల్ ట్రాఫిక్ ప్రివెన్షన్ యాక్ట్-1956 సెక్షన్లు 3, 4, 5 ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించారు. ప్రధాన నిర్వాహకుడు ఆదిత్య చౌదరి ముందుగానే అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు గుర్తించారు. దాడిలో పట్టుబడిన ఇద్దరు మహిళలను రక్షించి, రెస్క్యూ హోంకు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ కేసును వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిర్వాహకుడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ఎస్.ఎచ్.ఓ తెలిపారు.

## వృత్తి విద్యతో ఉపాధి సాధ్యం




- జేఎన్ఏఎఫ్ఏయూ సీఏఫ్ఏ ప్రొఫెసర్ ఆనంద్ రావు
- హితంస్ అకాడమీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహణ

**మొయినాబాద్, విశాలభారతి:** నిరుద్యోగ యువతకు వృత్తి విద్య ద్వారా స్వయం ఉపాధి కల్పించడంలో హితంస్ అకాడమీ కీలక పాత్ర పోషిస్తోందని జేఎన్ఏఎఫ్ఏయూ సీఏఫ్ఏ ప్రొఫెసర్ ఆనంద్ రావు అన్నారు. ఫ్యాషన్ డిజైన్, మేకప్ ఆర్టిస్ట్ వంటి వృత్తి విద్యా కోర్సులు యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతున్నాయని ఆయన పేర్కొన్నారు. నగరంలోని అమీర్పేటలో గల హితంస్ అకాడమీ - హిందుస్థాన్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ అండ్ మేనేజ్మెంట్ స్కిల్స్ ఆధ్వర్యంలో ఫ్యాషన్ డిజైన్, మేకప్ ఆర్టిస్ట్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థుల 2026 గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని సురంగల్ సమీపంలోని ఒక వ్యవసాయ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అకాడమిక్ డైరెక్టర్, విద్యావేత్త ఏం. రఫీ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ ఆనంద్ రావు, ప్రొఫెసర్ కమల్ రాయిలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వృత్తి విద్య పూర్తి చేసిన విద్యార్థులకు గోల్డ్ మెడల్ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఆనంద్ రావు మాట్లాడుతూ, భారతదేశాన్ని ప్రపంచ నైపుణ్య రాజధానిగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారని తెలిపారు. భారతదేశ వస్త్ర, ఫ్యాషన్ రంగం దేశంలో రెండవ అతి పెద్ద పరిశ్రమగా ఎదిగిందని, ఫ్యాషన్ డిజైనింగ్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. యువత వృత్తి విద్యలో నైపుణ్యాలు సాధించి స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, అకాడమీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెనిజులాపై అమెరికా దాడిని ఖండిస్తూ నిరసన

- మధురో దంపతుల అరెస్టు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం
- అమెరికా సామ్రాజ్యవాద దురహంకారానికి ఎదురుదాడి చేయాలి




**మహబూబాబాద్, విశాలభారతి:** వెనిజులాపై అమెరికా దురాక్రమణ దాడిని ఖండిస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నిరశన కార్యక్రమం చేసింది. ఈ సందర్భంగా న్యూ డెమోక్రసీ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ ఎస్.కె మదార్ మాట్లాడుతూ... అమెరికా సామ్రాజ్య వాదులు ప్రజలచే ఎన్నుకోబడిన, సార్వభౌమాధికారం, సర్వం సహాధికారం కలిగిన, వెనెజులా దేశంపై అర్ధరాత్రి తన మిలిటరీ పశుబలంతో, బాంబుదాడులు జరిపి, అనేక మందిని చంపి, వెనిజులా దేశ అధ్యక్షుడు నికోలస్ మధురో ఆయన సతీమణి సెలియా ను నిర్బంధించి,చేతికి సంకెళ్లు వేసి అవమానకరంగా అమెరికాకు తీసుకువెళ్లి నేరస్తునివలె, ఒక ఖైదీగా ఎలాంటి సౌకర్యాలు అందించకుండా, కరుడుగట్టిన నేరస్తుల మధ్య జైలులో బంధించారు. పైగా మా అమెరికా చట్టాల ప్రకారం విచారిస్తామని, నిసిగ్గుగా, అహంకారంగా, ప్రకటించి న ట్రంప్ అంతర్జాతీయ న్యాయ చట్టాలను అవహేళన చేశాడని మదార్ అన్నారు. ఈ దురహంకార పూరిత, ఉన్మాద చర్యను మా పార్టీ న్యూ డెమోక్రసీ ఖండిస్తుందని అన్నారు.

## పేదల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

**నిజామాబాద్, విశాలభారతి:** నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద గల నిజాంబాద్ రూరల్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి నాలుగు మండలాలకు చెందిన 214 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి అయిన నేపథ్యంలో పేదలకు తోడుగా వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం అప్పులు చేసి తెలంగాణను దివాళా తీసిందని విమర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి 18 డివిజన్ గ్రామ శాఖ అధ్యక్షుడు చిరంజీవి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ క్యాతం హనుమాన్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నారాయణ గౌడ్ యువ కాంగ్రెస్ పార్టీ 18 డివిజన్ యువ నాయకుడు రవి, అధికార యంత్రాంగం సిబ్బంది పాల్గొన్నారు.

## సేఫ్టీ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలి

- జిల్లా రవాణా శాఖ అధికారి జైపాల్ రెడ్డి



**మహబూబాబాద్, విశాల భారతి:** రోడ్డు భద్రత మహోత్సవాల సందర్భంగా గురువారం మహబూబాబాద్ పట్టణంలోని ఫాతిమా హైస్కూల్లో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయి చరణ్ అధ్యక్షతన ప్రైవేటు పాఠశాలల వాహనలు,ఆటో డ్రైవర్స్,కు వైద్య పరీక్షలు నిర్వహించి రోడ్డు, ఫైర్ భద్రతలపై అవగాహన సమీక్షా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక వాహన డ్రైవర్ ట్రాఫిక్ రూల్స్ ను పక్కాగా పాటించాలని, జీబ్రా క్రాసింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్, పాటిస్తూ, వాహనాల ఓవర్టేక్ చేసే సమయంలో నిబంధనలు పాటించాలని, ప్రతి ఒక డ్రైవర్ తన ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు తీసుకోవాలని,డ్రైవింగ్ చేసే క్రమంలో మొబైల్ ఫోన్ వినియోగించరాదని, టు వీలర్ వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఇతర హెవీ వెహికల్స్ నడిపే డ్రైవర్స్ సీట్ బెల్ట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. పాఠశాలల వాహనాలను క్రమం తప్పకుండా ఫిట్నెస్ ఉండే విధంగా నిత్యం తనిఖీలు చేసుకోవాలన్నారు. వాహనాలలో ఫైర్ సేఫ్టీ పరికరాలను ఎప్పటికీ సిద్ధంగా ఉంచుకోవాలని అనుకోని పరిస్థితులలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరించి అగ్ని ప్రమాదాలను నివారించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫైర్ అధికారి టీ .మోహన్ రావు, డిపిఆర్ఓ పి.రాజేంద్రప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి,సాయి చరణ్, ట్రాఫిక్ ఎస్ఐ అరుణ్ కుమార్, వైద్యాధికారులు, డాక్టర్ మౌనిక, డాక్టర్ నర్మద, డ్రైవర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వెనిజులాపై అమెరికా దురాక్రమణ




**మహబూబాబాద్, విశాలభారతి:** గత శనివారం అర్ధరాత్రి సమయంలో అమెరికా సైన్యం వెనిజులా దేశం పై వైమానిక దాడులు జరిపి వెనిజులా అధ్యక్షుడితో పాటు తన భార్యని నిర్బంధించి అమెరికాకు తీసుకు వెళ్ళడాన్ని ఖండిస్తూ సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో కేసముద్రం మండల కేంద్రం లో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ క్రేసముద్రం సబ్ డివిజన్ కార్యదర్శి కన్మంతరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ వెనిజులా దేశ సార్వ భౌమాదికార నియమాలను ఉల్లంఘిస్తూ నిరంకుశంగా అమెరికా సైన్యం వైమానిక దాడులు జరపడం అత్యంత దుర్మార్గం అని ఆయన అన్నారు. వెనిజులా దేశ ప్రజలచే ప్రజాస్వామికంగా ఎన్నికైన అధ్యక్షుడితో పాటు తన భార్యని నిర్బంధించి అమెరికాకు తీసుకు వెళ్ళి జైలులో పెట్టడం అనేది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అని అన్నారు. చమురు నిల్వలను దోచుకోవడానికే వెనిజులా పై అమెరికా దాడి చేసిందన్నారు. ప్రపంచ మొత్తం చమురు (ఆయిల్)సరఫరాలో 20శాతం వెనిజులాకే దక్కుతుంది.వెనిజులాలో ఉన్న చమురుపై పెత్తనం చేయడం కోసమే అమెరికా దేశం వెనిజులా దేశం పై దాడి చేసిందన్నారు.ప్రపంచాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవడం కోసం ఆయిల్ నిల్వలున్న దేశాలపై అమెరికా దాడులు చేస్తుందని అన్నారు. అక్రమంగా నిర్బంధించిన వెనిజులా దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లోరేస్ లను వెంటనే విడుదల చేసి పంపించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద మౌలాన, కరీం, దేవేందర్, నవీన్ ఇమామ్, పెద్ద హుస్సేన్, చిన్న హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని వినతి వినతి పత్రం ఇచ్చిన ఆశ్రమ సభ్యులు

**నిజామాబాద్ , విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని శ్రీ కేదారేశ్వర ఆశ్రమ సభ్యులు హైదరాబాదులోని మంత్రి కార్యాలయంలో కలిసి వినతి పత్రం గురువారం అందించారు. నందిపేట్ మండల కేంద్రంలో గల శ్రీ కేదరీశ్వర ఆలయ వ్యవస్థాపకులు శ్రీ కేదర నంద స్వాముల ఆదేశాల మేరకు హైదరాబాద్ వెళ్లి మంత్రిని కలిసామని. పేద ప్రజలకు ఆశ్రమ భక్తులకు ఆరోగ్య సమస్యలు. నేత్ర సమస్యలకు అన్ని రకాల పరీక్షలు వాటిని నిర్వహించడానికి మందులు ఆశ్రమ వ్యవస్థాపకులు అందిస్తారని తెలిపారు. మంత్రి ట్రస్టు సభ్యులు శాలువ తో సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారులు సుదర్శన్ రెడ్డి బోధన్ ఎమ్మెల్యే. పి వినయ్ కుమార్ రెడ్డి ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ . శ్రీ కేదారేశ్వర ఆలయ ట్రస్టు సభ్యులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి, సుఖాల లక్ష్మణ్ జిల్లా. కాటిపల్లి నగేష్ రెడ్డి , మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# తనిఖీ పేరుతో భద్రతా కవచమా..?

**సత్తుపల్లి, విశాలభారతి:**

సత్తుపల్లి నియోజకవర్గంలో మెడికల్ వ్యాపారం చట్టాల ఆధారంగా నడుస్తోందా? లేక తనిఖీల పేరుతో ఒక నిర్దిష్ట వ్యవస్థకు రక్షణ కల్పించే తెరవెనుక సహకారం కొనసాగుతోందా? అనే ప్రశ్నలు ఇప్పుడు పట్టణమంతా వినిపిస్తున్నాయి. వరుస ఆరోపణలు, ఫిర్యాదులు, కథనాలు వెలువడుతున్నా, అధికార యంత్రాంగం నుంచి కనిపిస్తున్న స్పందన మాత్రం ప్రజల్లో మరింత అనుమానాలను రేకెత్తిస్తోంది. తాజాగా జరిగిన డ్రగ్ ఇన్స్పెక్టర్ తనిఖీ ఈ అనుమానాలకు కొత్త బలాన్ని చేకూర్చింది. తనిఖీ అనేది అకస్మాత్తుగా జరగాల్సిన ప్రక్రియ. కానీ ఇక్కడ మాత్రం అధికారుల రాకకు ముందే కొన్ని మెడికల్ షాపులు షట్టర్లు దించుకోవడం, మరికొన్ని అప్రమత్తంగా వ్యవహరించడం కనిపించింది. ఇది యాదృచ్ఛికం కాదని, తనిఖీలకు ముందే సమాచారం లీక్ అవుతోందన్న ఆరోపణలు పట్టణంలో విస్తృతంగా వినిపిస్తున్నాయి. తనిఖీలు జరిగాయి అన్న మాటే తప్ప, వాటి ప్రభావం మాత్రం ఎక్కడా కనిపించకపోవడం ప్రజలను ఆలోచింపజేస్తోంది. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయం జరుగుతోందన్న ఆరోపణలు, కాలం చెల్లిన మందులపై వచ్చిన ఫిర్యాదులు, లైసెన్స్ లేకుండా నడుస్తున్న మెడికల్ షాపులపై చర్చలు కొనసాగుతున్నప్పటికీ, "లోపాలేమీ లేవు" అన్న అధికారిక వ్యాఖ్యలు మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి. డ్రగ్ ఇన్స్పెక్టర్ "హాస్పిటల్ మెడికల్



స్టోర్లన్నింటినీ తనిఖీ చేశాం... ఎక్కడా లోపాలు కనిపించలేదు" అని మాత్రమే చెప్పి, మీడియా అడిగిన కీలక ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా వెళ్లిపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ప్రజారోగ్యానికి నేరుగా సంబంధించిన అంశాల్లో ఇలాంటి మౌనం అనుమానాలను మరింత లోతుగా నాటుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు, నిబంధనల ప్రకారం బాధ్యతగా వ్యాపారం చేయాలని ప్రయత్నిస్తున్న చిన్న మెడికల్ వ్యాపారులు ఈ వ్యవస్థలో తీవ్రంగా నష్టపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. సిండికేట్ లో భాగం కానివారిపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయని, ఆర్థికంగా నిలబడలేని పరిస్థితికి నెట్టివేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇది స్వేచ్ఛా వ్యాపార సూత్రాలకు పూర్తిగా విరుద్ధమైన పరిస్థితిగా మారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవస్థ యాదృచ్ఛికంగా ఏర్పడలేదని, దశలవారీగా రూపొందించిన ఒక వ్యూహాత్మక సిండికేట్ మోడల్ గా పనిచేస్తోందన్న వాదన కూడా బలపడుతోంది. మార్కెట్ పై పట్టు సాధించడం, సరఫరాను నియంత్రించడం, ధరలను ప్రభావితం చేయడం, నిబంధనలతో నడిచే వ్యాపారులను పక్కకు నెట్టడం వంటి చర్యలు ఒకే దిశగా సాగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఇదే క్రమంలో, హోల్ సేల్-రిటైల్ మధ్య ఉండాల్సిన గీతలు చెరిగిపోయాయని విమర్శలు వస్తున్నాయి. హోల్ సేల్ లైసెన్సుల ఆధారంగా రిటైల్ అమ్మకాలు సాగుతున్నాయన్న ఆరోపణలు ధరల పోటీని నిర్వీర్యం చేస్తున్నాయని, సిండికేట్ ఆధిపత్యాన్ని మరింత బలపరుస్తున్నాయని స్థానికులు అంటున్నారు. ఈ పరిస్థితుల్లో పలు రకాల ప్రశ్నలు సత్తుపల్లి ప్రజలను తట్టిలేపుతూ ఆలోచింపచేస్తున్నాయి .

తనిఖీ అంటే వచ్చి చూసి వెళ్లడమా? లేక నిజాలను వెలికి తీసి, తప్పిదాలపై చర్యలు తీసుకోవడమా? ప్రజారోగ్యంతో ముడిపడిన శాఖలో పారదర్శకత లేకపోవడం సామాన్య ప్రజల్లో భయాన్ని, అనిశ్చితిని పెంచుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా లైసెన్స్ లేని మెడికల్ షాపుల వివరాలు, తనిఖీలకు ముందే లీకైన సమాచారంపై ఆధారాలు, బాధిత వ్యాపారుల వాంగ్మూలాలతో కూడిన సమగ్ర ఫిర్యాదును జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలని సత్తుపల్లి ప్రజలు యోచిస్తున్నారు. డ్రగ్స్ కంట్రోల్ శాఖ తనిఖీ రికార్డుల పై స్వతంత్ర విచారణ జరపాలని, అవసరమైతే విజిలెన్స్ లేదా ఏసీబీ స్థాయి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఇప్పుడు ఎదురు చూపులు మరో తనిఖీపై కాదు. చట్టం నిజంగా పనిచేస్తుందన్న స్పష్టమైన, దృఢమైన చర్యలపైనే, ఈ వ్యవహారంపై మరిన్ని కీలక విషయాలు, లోతైన విశ్లేషణతో విశాల భారతి శీర్షికల్లో కొనసాగింపుగా మరో కథనం త్వరలో వెలువడనుంది.

## ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన బోడుప్పల్ మాజీ మేయర్



**మేడిపల్లి, విశాలభారతి:** మేడ్చల్ నియోజకవర్గంలోని బోడుప్పల్ డివిజన్, పరిధిలోని అంబేద్కర్ నగర్ లో నిర్మితమైన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ పూజా కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ , స్థానిక కార్పొరేటర్ రాసాల వెంకటేష్ , మాజీ కార్పొరేటర్ జక్కా రాములు, మాజీ ఎంపిటిసి నత్తి మైసయ్య . స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అజయ్ యాదవ్ మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పేద కుటుంబాలకు స్వంత గృహ సాకారం చేస్తూ ఇందిరమ్మ ఇళ్లు అందజేసింది. ఈ పథకం ద్వారా లక్షలాది కుటుంబాలకు లబ్ధి చేకూరింది" అని తెలిపారు.

## ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న తుంగతుర్తి రవి



**మేడిపల్లి, విశాలభారతి:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ -9వ డివిజన్ మేడిపల్లి లోని పర్వతాపూర్ ప్రాంతంలో గురువారం శ్రీ చైతన్య గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ, ఇలాంటి ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే కాకుండా, పోషకాహారంపై అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. చిన్న వయస్సులోనే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కలిగితే భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించవచ్చని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల ఆహార పదార్థాలు, వారి ఆలోచనా విధానం ప్రశంసనీయమని పేర్కొంటూ, ఇటువంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్న శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ రమేష్, యాసారం నాగేష్, కపిల్ మరియు శ్రీ చైతన్య గ్రూప్ అఫ్ స్కూల్స్ పర్వతపూర్ బ్రాంచ్ మేనేజింగ్ డైరెక్టర్ S.రమేష్ బాబు, నారపల్లి బ్రాంచ్ ప్రిన్సిపాల్ వెంకటేష్ యాదవ్, అకాడమిక్ ఇంచార్జి విశాల్ మరియు స్కూల్ సిబ్బంది, విద్యార్థులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో కలిపోద్దు



**రాజేంద్రనగర్, విశాల భారతి:** రాజేంద్రనగర్ సర్కిల్ ను హైదరాబాద్ డివిజన్లో కలపవద్దని రాజేదనాన్న నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ యొక్క నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్ రాజేంద్ర నగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు. శాంతియుతంగా ధర్నాను నిర్వహిస్తున్నమని కానీ పోలీసులు ధర్నాలు నిర్వహించకుండా, ధర్నా చౌక్ వద్ద టెంటును కూడా పోలీసులు తొలగించారని, బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు ధర్నా నిర్వహించిన బిఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## కీసర ఆర్డీఓగా ఎస్ రాజేష్ కుమార్



**కీసర, విశాలభారతి :** గురువారం కీసర ఆర్డీఓ గా బాధ్యతలు చేపట్టిన ఎస్ రాజేష్ కుమార్.ఇటీవల కీసర ఆర్డీఓ గా పని చేసిన వెంకట ఉపేందర్ రెడ్డి హౌసింగ్ రోడ్డు ట్రాన్స్పోర్ట్,డిపార్ట్మెంట్ కి బదిలీ అయ్యారు.గతంలో కీసర తహసీల్దార్ గా విధులు నిర్వహించారు అలాగే ఎన్నికల ముందు కీసర ఆర్డీఓ గా కూడా విధులు నిర్వహించారు.కీసర గుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఆర్డీఓ రాజేష్ కుమార్.ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.కీసర ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రాజేష్ కుమార్ కి శాలువ కప్పిన అడ్మినిస్ట్రేషన్ రాంమోహన్, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ రెడ్డి.ఈ కార్యక్రమంలో ఆలయ ఈ ఓ సుధాకర్ రెడ్డి,కీసర తహసీల్దార్ యాదగిరి రెడ్డి,ఆలయ చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీఓ నేతలు



**హైదరాబాద్, విశాలభారతి:** జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ హరి చందన దాసరిని గురువారం తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షులు శ్రీ ఎస్. విక్రమ్ కుమార్ నేతృత్వంలో, జిల్లా కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీ కె.ఆర్. రాజ్ కుమార్, పబ్లిసిటీ సెక్రటరీ వైదిక శ్రేష్టలు కలెక్టర్ కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విక్రమ్ కుమార్ మాట్లాడుతూ.. గత ఏడాది కాలంగా జిల్లా యంత్రాంగం పనితీరులోనూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలోనూ కలెక్టర్ గారు చూపిన చొరవ అభినందనీయమని కొనియాడారు. ముఖ్యంగా పౌరసరఫరాల శాఖ సర్కిల్ కార్యాలయాలకు సొంత భవనాలు లేక ఎదురవుతున్న ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకెళ్తూ, గోషామహల్ పరిధిలోని ఖాళీ ప్రభుత్వ భవనాన్ని కేటాయించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, ప్రజలకు సేవలను మరింత చేరువ చేసేందుకు మెహదీపట్నం, నాంపల్లి సర్కిల్ కార్యాలయాలకు తక్షణమే ప్రభుత్వ భవనాలను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యల పట్ల కలెక్టర్, ప్రదర్శించిన సానుకూల దృక్పథానికి టీఎన్జీఓ నేతలు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ముగిసిన ఎన్‌సిసి శీతాకాల సమావేశం శిబిరం

**అశ్వాపురం, విశాలభారతి :** మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలో గల తెలంగాణ గిరిజన బాలుర గురుకుల డిగ్రీ కళాశాల (ఎన్.ఎస్.ఎస్ )యూనిట్ ఆధ్వర్యంలో పాములపల్లి గ్రామంలో గత ఏడు రోజులుగా నిర్వహిస్తున్న శీతాకాల ప్రత్యేక శిబిరం గురువారంతో ముగిసింది. ఈ ముగింపు వేడుకకు జిల్లా ఎన్.ఎస్.ఎస్. కన్వీనర్ డా వేముల కామేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు చదువుతో పాటు సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఏడు రోజుల పాటు విద్యార్థులు చేసిన శ్రమదానం, సామాజిక అవగాహన కార్యక్రమాలు గ్రామంలో మంచి మార్పును తీసుకువచ్చాయని ఆయన అభినందించారు. ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ చిట్టిబాబు గత ఏడు రోజుల్లో నిర్వహించిన ప్లాస్టిక్ వ్యతిరేక ర్యాలీ, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన, ఆరోగ్య శిబిరం, శ్రమదానం తదితర కార్యక్రమాల నివేదికను సభలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బండారుపల్లి రవి, గ్రామ సర్పంచ్ కె. సరిత, పంచాయతీ కార్యదర్శి లవకుమార్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఉప సర్పంచ్ లక్ష్మణ్ కళాశాల అధ్యాపకులు, గ్రామస్తులు, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

## సివరేజ్ ట్రీక్మెంట్ ప్లాంట్ ఏర్పాటును ఖండించిన అంబేద్కర్ సంఘం

**సంఘీభావం ప్రకటించిన అధ్యక్షులు కర్రె గణేష్**



**కీసర,విశాలభారతి :**

దళితుల పక్షాన అండగా ఉండాల్సిన రాష్ట్ర ప్రభుత్వం సాగు చేసుకుంటున్న దళితుల భూములను అక్రమదారిలో ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తుంది.కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రె గణేష్, ప్రధాన కార్యదర్శి మంచాల సంజీవలు హెచ్చరిస్తున్నారు.ఘట్ కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి సర్వే నెంబర్ 388లో గల 36 ఎకరాల 20 గుంటల భూమి దళితులు,బిసిలు వ్యవసాయం చేసుకుంటున్నరూ ఇట్టి భూమిపై రాష్ట్ర ప్రభుత్వం కన్నుపడడం సరికాదన్నారు.70 సంవత్సరాలకు పైగా 150 కుటుంబాలు వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నాయని గుర్తు చేశారు.భూ రికార్డులో ఈ భూమి వ్యవసాయం కిందే చూపుతున్న రాష్ట్ర సర్కార్ దళితులు,బీసీ రైతుల పొట్ట కొట్టేందుకు సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను హెచ్ఎండబ్ల్యూఎస్ వ్యవసాయ భూముల్లో కడీలు పాతడంను తీవ్రంగా ఖండించారు.రైతులందరూ కూడా అధైర్యపడాల్సిన అవసరం లేదని అందరు కలిసికట్టుగా పోరాటం చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.కొన్నియేండ్లుగా వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్న దళిత,బీసీ బిడ్డలకు పట్టాలు ఇవ్వాల్సింది పోయి రాష్ట్ర ప్రభుత్వం అక్రమ దారిలో రైతుల భూమిని దోచుకునే ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు.రైతులకు కీసర అంబేద్కర్ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని,రాష్ట్ర సర్కారు తీసుకున్న నిర్ణయం వెనక్కి తగ్గకపోతే రైతుల పక్షాన పోరాటం చేసేందుకు కీసర మండల అంబేద్కర్ సంఘం సిద్ధంగా ఉందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి సంజీవ,ఏం అర్ పి ఎస్ అధ్యక్షుడు పరమేష్,మాజీ ఎంపీటీసీ మల్లేష్ నల్లోల కుమార్ మహేందర్,రవీందర్,మీసాల భాస్కర్,మంచాల నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు




**ఎల్‌బీ నగర్ ఏసీపీ కృష్ణయ్య హెచ్చరిక**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :**

జాతీయ రోడ్డు భద్రత మహోత్సవం-2026 సందర్భంగా గురువారం నాగోల్ ఎక్స్ రోడ్ వద్ద ఎల్‌బీ నగర్ డివిజన్ ఏసీపీ కృష్ణయ్య ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీతో పాటు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగర రోడ్లపై వాహనదారుల నిర్లక్ష్యం వల్ల రోజురోజుకు ప్రమాదాలు పెరుగుతున్నాయని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఏసీపీ కృష్ణయ్య హెచ్చరించారు. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ నియంత్రణ, వాహన తనిఖీలు చేపట్టారు. హెల్మెట్ లేకుండా, లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్‌స్‌ను పట్టించుకోకుండా దూసుకెళ్లడం వల్ల తమ ప్రాణాలకే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలుగుతుందని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్ర నేరమని, మైనర్లకు వాహనాలు ఇచ్చి డ్రైవింగ్ చేయించడం కూడా చట్టపరంగా శిక్షార్హమని ఏసీపీ స్పష్టం చేశారు. తల్లిదండ్రులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అలాగే, నగరంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, తెలియని వ్యక్తులు ఫోన్‌లు లేదా మెసేజ్‌ల ద్వారా బ్యాంకు వివరాలు, ఓటీపీలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగోల్ పోలీస్ స్టేషన్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ, సబ్ ఇన్స్పెక్టర్లు ప్రసాద్, రమేష్ పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు నాగరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాకారంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్**

**మొయినాబాద్, విశాలభారతి:**

గత కొన్ని నెలలుగా తీవ్రంగా ఉన్న నీటి సమస్యను బాకారం గ్రామంలోని పదోవ వార్డులో గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ పరిష్కరించారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు కలిసి కాలిపోయిన బోరు మోటర్ స్థానంలో నూతన మోటర్‌ను ఏర్పాటు చేశారు. పదోవ వార్డులోని బోరు మోటర్ గత కొన్ని నెలల క్రితమే కాలిపోవడంతో తాగునీటి కొరత ఏర్పడింది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనగా, సమస్యపై స్పందించిన గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి బోరును పరిశీలించారు. అనంతరం బోరును ఫ్రెస్సింగ్ చేయించి, నూతన మోటర్‌ను బిగించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తానని తెలిపారు. గ్రామ ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా గ్రామంలోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, వార్డు సభ్యులు కొంతం నాగేశ్వర్ రెడ్డి, రాయనోళ్ల ఉపేందర్ యాదవ్, బంధి అనిల్, నాయకులు కొండకల్ల శ్రీకాంత్, బిక్షపతి గౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ప్రత్యేక అధికారి ప్రవీణ్

**కస్తూరిబా విద్యాలయాన్ని తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి**



నిజామాబాద్, విశాలభారతి: మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల వసతి గృహాన్ని, తరగతి గదులను, వంటగది, మరుగుదొడ్లు, పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, అందించడమే లక్ష్యంగా పాఠశాల నిర్వహణ కొనసాగాలని పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్నకు సూచించారు. ఆయన వెంట ఎంపిడివో సతీష్, ఏపివో రవి, జూనియర్ అసిస్టెంట్ ఒడ్డెన్న ఉన్నారు.

## ఆయిల్ ఫీడ్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన సింగరాజుపల్లి యువత



**దేవరుప్పుల, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫీడ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ జంగా రాఘవరెడ్డిని దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామ యువత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల మరియు గ్రామంలో ఆయిల్ ఫీడ్ పంటల అభివృద్ధి రైతులకు అవగాహన కార్యక్రమాలు యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలను చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. చైర్మన్ గారు యువతతో సానుకూలంగా స్పందిస్తూ, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ తాళ్లపల్లి వేణు, రాపాక శ్రీశైలం, రాపాక రమేష్, రాపాక సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

## భౌతికదేహాన్ని సందర్శించిన సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలకేంద్రానికి చెందిన దండంపల్లి సోమేశ్వర్(35)నిన్న ఉదయం గుండెపోటుతో మరణించగా ఈ రోజు వారి ఇంటికి వెళ్ళి వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపి వారి కుటుంబ సభ్యులకు 10వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేసిన దేవరుప్పుల సర్పంచ్ పెద్ది కృష్ణ మూర్తి గౌడ్. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చిలుకూరి నర్సయ్య, తోటకూరి రమేష్,గోడిశాల శ్రీనివాస్, చింత సుమలత ఐలయ్య,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల సాయి ప్రకాష్,నాయకులు తోటకూరి మహేష్,పత్తేపురపు శేఖర్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గర్ల్ ఎంపవర్మెంట్ మిషన్ 2025 శీతాకాల ప్రారంభోత్సవ వేడుక



**విశాలభారతి, ఎన్టిపిసి:** గర్ల్ ఎంపవర్మెంట్ మిషన్ 2025 ప్రారంభోత్సవ శీతాకాల వేడుక గురువారం ఎన్టిపిసి రామగుండం లోని ఈడిసి హాల్ లో ఎంతో ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమం గర్ల్ ఎంపవర్మెంట్ మిషన్ 2025 శీతాకాల సమావేశానికి అధికారికంగా ప్రారంభించారు, ఇది సమీప సమాజాల నుండి యువతులకు విద్య, నైపుణ్య అభివృద్ధి మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే కార్యకలాపాల ద్వారా సాధికారత కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వేడుకను డి ఎం ఎస్ అధ్యక్షురాలు రాఖీ సమంత ప్రారంభించారు, ఈ సమావేశంలో పాల్గొన్న విద్యార్థులకు గర్ల్ ఎంపవర్మెంట్ మిషన్ కిట్లను పంపిణీ చేశారు. కిట్ల పంపిణీ యువతుల సమగ్ర అభివృద్ధిని పెంపొందించడం మరియు వారి ఆకాంక్షలను నమ్మకంగా కొనసాగించడానికి వారిని ప్రోత్సహించడం పట్ల ఎన్ టి పి సి యొక్క నిరంతర నిబద్ధతను సూచిస్తుంది.అని తెలిపారు.విద్యార్థులు కిట్లను ఉత్సాహంతో అందుకున్నారు, ఇది నెల రోజుల పాటు జరిగే కార్యక్రమానికి సానుకూల మరియు శక్తివంతమైన స్వరాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో గర్ల్ ఎంపవర్మెంట్ మిషన్ చొరవతో సంబంధం ఉన్న అధికారులు మరియు సభ్యులు పాల్గొన్నారు, వారు విద్యార్థులను ప్రోత్సహించి, కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.



## 'ది రాజాసాబ్' అభ్యర్థనను తిరస్కరించిన తెలంగాణ ప్రభుత్వం

మారుతి దర్శకత్వంలో ప్రభాస్ నటించిన హారర్ ఫాంటసీ థ్రిల్లర్ 'ది రాజాసాబ్'. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అయితే.. సినిమా టికెట్ ధరల పెంపు అభ్యర్థనను తెలంగాణ ప్రభుత్వం తిరస్కరించింది. దీంతో సాధారణ రేట్లకే టికెట్ ధరలను ఖరారు చేస్తూ థియేటర్లు బుకింగ్ ప్రారంభించాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.